
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
మెదక్
20
బుధవారం 23 ఆగస్టు 2017



గజవాడలో సబ్సిడీ గొర్రెలు మృతి



- వారంలోనే 30 గొర్రెలు మృత్యువాత
- వ్యాధితోనే చనిపోతున్నాయని బాధితుల ఆవేదన

3 లో

గజవాడలో మృతి చెందిన సబ్సిడీ గొర్రె

కురిసేదెంత కొలిచేదెంత?

- అరకొరగా ఆటోమేటిక్ వాతావరణ కేంద్రాలు
- వర్షపాతం నమోదులో లోపించిన శాస్త్రీయత
- పంటల బీమాపై ప్రభావం చూపుతున్న నివేదికలు
- పరిహారం అందక నష్టపోతున్న రైతులు
- కాలం చెల్లిన రెయిన్‌గేజ్‌లపైనే ఆధారపడుతున్న అధికారులు

5

వర్షాభావ పరిస్థితులను అంచనా వేయడంలో.. నమోదు ప్రక్రియ కీలకం. కరువును అంచనా వేయడం, అతివృష్టి, అనావృష్టి తీవ్రతను తెలియ జెప్పడంలో రోజువారీగా నమోదు ప్రక్రియలే ప్రధానం. ఏ మాత్రం తప్పుగా నమోదు చేసినా రైతులకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి అందే సాయంతో కోతపడే ప్రమాదం ఉంది. వర్షపాత నమోదు కోసం కాలం చెల్లిన రెయిన్‌గేజ్‌లపైనే అధికారులు ఇంకా ఆధారపడుతున్నారు. సహాయ గణాంకాధికారుల నిర్లక్ష్యంతో చినుకుల లెక్కల్లో శాస్త్రీయత కొరవడుతోంది. నివేదికలను బట్టే ప్రభుత్వం ఒక అంచనాకు రావడంతో రైతులకు అందాల్సిన పంటల బీమాలో తీవ్ర సమస్యలు తలెత్తుతున్నాయి.



మెదక్‌లో ఏర్పాటు చేసిన వాతావరణ కేంద్రం

కలెక్టరేట్ స్థల ఎంపికలో జాప్యమెందుకు?

- రాజకీయ లబ్ధి ఉంటే ఊరుకోం
- ప్రజలను ఇబ్బందిపెట్టే విధంగా ఉండొద్దు
- ఆర్డీవో కార్యాలయ సమీపంలోనే ఉండేలా చూడండి
- దూరప్రాంతాన్ని ఎంపిక చేస్తే ఆందోళన చేస్తాం
- మాజీ మంత్రి, డీసీసీ అధ్యక్షురాలు సునీతాలక్ష్మారెడ్డి

5



మెదక్‌లో విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న సునీతారెడ్డి


ప్రాజెక్టులను ఆపే కుట్రలు మానుకోండి

- ప్రతిపక్షాలు అడ్డుపడడం సరికాదు
- అడ్డంకులెన్నొచ్చినా కాళేశ్వరం ఆగదు
- మల్లన్నసాగర్‌తో జిల్లా సస్యశ్యామలం
- త్వరలో ఘణపురం ప్రాజెక్టు ఎత్తు పనులు
- ప్రాజెక్టులంటేనే కాంగ్రెసోళ్లకు భయం
- ప్రజలు మర్చిపోతారనే అడ్డుకుంటున్నారు
- మత్స్యకారులకు ప్రత్యేక నిధులు
- వందశాతం సబ్సిడీపై చేపపిల్లల పంపిణీ
- సదస్సులో డిప్యూటీస్పీకర్ పద్మారెడ్డి

5 లో



కొంటూరు చెరువు వద్ద మాట్లాడుతున్న పద్మాదేవేందర్ రెడ్డి



పురుగు పట్టిన కంది పప్పు

అంగన్‌వాడీ కేంద్రంలో పురుగు పట్టిన బియ్యం, పప్పు

రేగోడు: అంగన్‌వాడీ కేంద్రాలపై అధికారుల పర్యవేక్షణ లోపించడంతో నాణ్యతలేని సరుకులు వంటకు వినియోగిస్తున్నారు. దీంతో పురుగు పట్టిన బియ్యం, పప్పుతో తయారు చేసిన వంటలు తినాలి వస్తోంది. రేగోడు మూడో అంగన్‌వాడీ కేంద్రంలో మంగళవారం అన్నం సాంబర్‌లో పురుగులు రావడంతో గ్రామస్తులు నిలదీశారు. సర్పంచ్ సునితకు ఫిర్యాదు చేశారు. ఆమె అంగన్‌వాడీ కేంద్రానికి చేరుకొని సరుకులను పరిశీలించి సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇంత అధ్వానంగా ఉన్న సరుకులను వంటకు ఎలా వినియోగిస్తారని ప్రశ్నించారు. మీ ఇంటిలోని వారికైతే ఇలాంటి సరుకులను వినియోగిస్తారా అని నిలదీశారు. ఇలాంటి భోజనం చేసి పిల్లలు రోగాల బారిన పడితే మీరే బాధ్యత వహించాల్సి ఉంటుందని సర్పంచ్ హెచ్చరించారు. ఈ విషయమై అంగన్‌వాడీ సూపర్ వైజర్‌ను వివరణ కోరగా దీనిపై విచారణ జరిపి చర్యలు తీసుంటామని అన్నారు.



దిగాలుగా కూర్చున్న వృద్ధురాలు

అమ్మా నాగమ్మ.. ఎంత కష్టమొచ్చిందమ్మ

తూప్రాన్: అయ్యో పాపం నాగమ్మ. ఎవరో తీసుకొచ్చి రోడ్డున వదిలేశారు. రెండు రోజులుగా అనాథలాగా ఉండిపోయింది. ఈ సంఘటన మెదక్ జిల్లా తూప్రాన్‌లో చోటు చేసుకుంది. యాదాద్రి జిల్లా లక్ష్మీనృసింహస్వామి సన్నిధిలో నాగమ్మ ఉంటుంది. ఏవరు లేని ఆమెను మూడు రోజుల క్రితం తీసుకొచ్చి నాచారం గుట్ట వద్ద వదిలేశారు. అక్కడ నుంచి తూప్రాన్ వరక వచ్చిన నాగమ్మ గ్రామ పంచాయతీ సమీపంలో మంగళవారం రోజంతా ఉంది. నాగమ్మ దుస్థితి చూసిన దుకాణదారులు ఆమె సపర్యలు చేసి, భోజనం పెట్టించారు. పోలీసులకు సమాచారం ఇవ్వడంతో నాగమ్మ వద్దకొచ్చి యాదగిరి గుట్టకు తీసుకెళ్లేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు.

విద్యుదాఘాతంతో రెండు పాడి గేదెల మృతి

అల్లాదుర్గం: మండలంలోని రెడ్డిపల్లి శివారులో గల వ్యవసాయ క్షేత్రంలో విద్యుదాఘాతానికి గురై రెండు పాడి గేదెలు మృతి చెందినట్లు బాధితులు మంగళవారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. బాధితుల కథనం మేరకు.. మండలంలోని వెంకట్‌రావుపేట గ్రామానికి చెందిన ఎస్.వెంకట్‌రెడ్డి, చాకలి భేతయ్య అనే రైతులకు సంబంధించిన పాడి గేదెలు సోమవారం రాత్రి నుంచి కనిపించకపోవడంతో పరిసర ప్రాంతాల్లో గాలించారు. అయితే మంగళవారం సాయంత్రం రెడ్డిపల్లి గ్రామ శివారులోని ఓ రైతుకు సంబందించిన పొలం వద్ద రెండు పాడి గేదెలు మృతి చెంది ఉండడంతో అనుమానం వ్యక్తం చేస్తున్నారు. దీనిపై విచారణ జరిపి తమకు న్యాయం చేయాలని పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

పంచాయతీ రికార్డుల సీజ్

సిద్దిపేట రూరల్: సిద్దిపేట మండలం తడ్కపల్లి గ్రామ పంచాయతీ రికార్డులను మంగళవారం ఈవోఆర్డీ వేదవతి సీజ్ చేశారు. పంచాయతీ నిధులు దుర్వినియోగం అయ్యాయని, వార్డు సభ్యుల సంతకాలు ఫోర్జరి చేసి వెంచర్, పౌల్ట్రీ ఫాం నిర్మాణాలకు సర్పంచ్, పంచాయతీ కార్యదర్శి అనుమతులు ఇచ్చారని, పంచాయతీకి చెందిన చెట్లను విక్రయించగా వచ్చిన డబ్బులను సొంతానికి వాడుకున్నారని ఆరోపిస్తూ ఉప సర్పంచ్, వార్డు సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎంపీడీవో సమ్మిరెడ్డి విచారణకు ఆదేశించారు. మండల ఈవోఆర్డీ మంగళవారం గ్రామానికి వెళ్లి విచారణ జరిపారు. రికార్డుల నమోదుకు, సర్పంచ్ ఇచ్చిన సమాధానాలకు పొంతన లేకపోవడంతో వాటికి సంబంధించిన బిల్లులను పరిశీలించేందుకు రికార్డులను సీజ్ చేస్తున్నట్లు ఈవోర్డీ తెలిపారు.

26 నుంచి రాజీవ్ స్వగృహాలకు ఆన్‌లైన్ బుకింగ్ !

- **మూడు నెలల పాటు అవకాశం**
- **ప్రభుత్వ ఉద్యోగులు స్పందించకుంటే ఇతరులకు అవకాశం**
- **ఉద్యోగులకు మరో అవకాశం లేదంటున్న అధికారులు**

హైదరాబాద్, ఆగస్టు22(ఆంధ్రజ్యోతి): రాజీవ్ స్వగృహప్రాజెక్టు ద్వారా నిర్మించిన ఇళ్లను ప్రభుత్వ ఉద్యోగులకు కేటాయించాలని నిర్ణయించిన నేపథ్యంలో ఈనెల 26 నుంచి ఆన్‌లైన్ బుకింగ్‌లను ప్రారంభించనున్నారు. ముందుగా ప్రకటించినట్టుగానే కేవలం మూడు నెలల గడువును మాత్రం ఇవ్వనున్నారు. మూడు నెలల్లో ఉద్యోగులు ఇళ్లకొనుగోలు కోసం నమోదు చేసుకోకపోతే వీటిని ఇతరులకు అమ్మాలని కూడా ప్రభుత్వం నిర్ణయించింది. రాజీవ్ స్వగృహ ఇళ్లను ప్రభుత్వ ఉద్యోగులకు ఇవ్వాలని సీఎం కేసీఆర్ నిర్ణయించిన నాటి నుంచే ఉద్యోగులు వాటి ధరల పట్ల కాస్త నిరాసక్తిగానే ఉన్నారు. గత కొంత కాలం క్రితం కొందరు ఉద్యోగ సంఘాల నాయకులు వెళ్లి ధరల విషయంలో కొంత వెసులుబాటు కల్పించాలని కోరినా ప్రభుత్వం ససేమిరా అనడంతో ఉద్యోగులు ఏం చేయాలన్న దానిపై తర్జన భర్జన పడుతున్నారు. అయితే ఉద్యోగులు ఈ ఇళ్లను కొనుగోలు చేసేందుకు మూడు నెలల గడువు మాత్రమే ప్రభుత్వం ఇచ్చింది.

ఆన్‌లైన్ బుకింగ్‌కు స్పందన రాకపోతే ఇతరకు ఈ గృహాలను అమ్మేవిషయాన్ని పరిశీలిస్తామని అధికారులు తెలిపారు. కాగా బండ్లగూడలో నిర్మించిన 3,719 ఇళ్లను మొదటి దశలో విక్రయించనున్నారు. పారదర్శకంగానే ఇళ్లను విక్రయించడానికి రాజీవ్ స్వగృహ కార్పొరేషన్ తరపున ఆన్‌లైన్ ప్రక్రియను ఈనెల 26 నుంచి ప్రారంభించనున్నారు. సెక్రటేరియట్‌లో గృహ నిర్మాణ శాఖ శాఖ మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి చేతల మీదుగా ఆన్‌లైన్ బుకింగ్ వెబ్‌సైట్‌ను ప్రారంభించనున్నారు. దీనికోసం సెంటర్ ఫర్ గుడ్ గవర్నెన్స్ ప్రత్యేక అప్లికేషన్‌ను అభివృద్దిచేసింది. రాజీవ్ స్వగృహ కార్పొరేషన్ అన్ని మౌలిక సదుపాయాలతో కూడిన ఫ్లాట్‌లను నిర్మించింది. ప్రస్తుతం 2750కి పైగా ఫ్లాట్‌లు గృహప్రవేశానికి సిద్ధంగా ఉన్నట్టు అధికారులు తెలిపారు. మరికొన్ని ఫ్లాట్‌లు నిర్మాణం పూర్తి చేసుకుంటున్నాయని అన్నారు. మొదటి దశలో బండ్లగూడలో 2245 ఫ్లాట్‌లను, పోచారంలో 1474 ఫ్లాట్లను రాజీవ్ స్వగృహ అధికారులు విక్రయించనున్నారు. కాగా ప్రతి ఫ్లాట్‌కు ప్రత్యేకంగా ధరను నిర్ణయించి అమ్మకాలు చేయనున్నారు. బండ్లగూడలో నిర్మాణం పూర్తిచేసుకున్న ఇళ్లకు చ. అడుగుకు 1900 రూపాయలుగా, సెమీ ఫినిష్డ్ ఫ్లాట్స్‌కు 1700 రూపాయలుగా నిర్ణయించారు. అలాగే పోచారంలో నిర్మాణం పూర్తయిన ఫ్లాట్స్‌కు చ. అడుగుకు 1700 రూపాయలు, సెమి ఫినిష్ట్ వాటికి 1500 రూపాయలుగా నిర్ణయించారు. ఈ ఫ్లాట్‌ల అమ్మకం ద్వారా ప్రభుత్వానికి దాదాపు 545 కోట్ల రూఆపయల ఆదాయం వచ్చే అవకాశం ఉందని అధికారులు అంచనా వేస్తున్నారు.

గజవాడలో సబ్సిడీ గొర్రెల మృతి

- **వారంలో 30 జీవాల మృత్యువాత**
- **ఆందోళనలో లబ్ధిదారులు**

రేగోడు: గొల్లకుర్మలకు ప్రభుత్వం పంపిణీ చేస్తున్న సబ్సిడీ గొర్రెలు మృత్యువాత పడుతున్నాయి. సకాలంలో వైద్యం అందకపోవడం, వాతావరణం అనుకూలించకపోవడం వంటి కారణాల వల్ల ఒక్కొక్కటి చనిపోతున్నాయి. దీంతో లబ్ధిదారులు ఏం చేయాలో తెలియక ఆందోళన చెందుతున్నారు. ఒకటి కాదు రెండు కాదు వారంలో 30 గొర్రెలు మృతి చెందడంతో లబ్ధిదారులు లబోదిబో మంటున్నారు. రేగోడు మండలం గజవాడ గ్రామానికి చెందిన 71 లబ్ధిదారులకు వారం రోజుల క్రితం వరంగల్ జిల్లా తుగళి మండలం నుంచి గొర్రెలను తెప్పించి పంపిణీ చేశారు. అవి వ్యాధిబారిన పడి మృతి చెందుతున్నాయి. మేత మేయం లేదని రైతులు అన్నారు. గజవాడ గ్రామానికి చెందిన బండారి క్రిష్ణ శేఖర్, శ్రీనివాస్, అశోక్, మల్‌గొండ, మల్లయ్య, విఠల్, మారుతి, మల్లయ్య, అశోక్ తదితరులకు చెందిన గొర్రెలు మృత్యువాత పడ్డాయి. గొర్రెల కొనుగోలులో కూడా అధికారులు శ్రద్ధ చూపలేదని పలువురు ఆరోపించా రు. గొర్రెలు వ్యాధి బారిన పడినట్లు పశువైద్యాధికారులకు



గజవాడలో మృతి చెందిన సబ్సిడీ గొర్రె

ఫోన్ ద్వారా సమాచారం ఇచ్చినా ఫలితం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. సకాలంలో వైద్యం అందకే జీవాలు చనిపోతున్నాయని బాధితులు ఆరోపించారు. ఒకచోటు నుంచి మరో చోటికి తేవడం వల్ల వాతావరణం పడక చనిపోతున్నాయని పేర్కొన్నారు.

వైద్యం అందడం లేదు



ప్రభుత్వం పంపిణీ చేస్తున్న సబ్సిడీ గొర్రెలకు వైద్యం అందడం లేదు. వ్యాధుల బారిన పడి జీవాలు చనిపో తున్నాయి. వైద్యాధికారి అందుబాటులో ఉండరు. మందులు కూడా ఇవ్వ డం లేదు.

- దుర్గయ్య

గొర్రెలు చనిపోతున్నాయి



గొర్రెలు మేపుకొని బాగుపడదామనుకుంటే అవి చనిపోతున్నాయి. వాతావరణం పడకపోవడమని భావిస్తున్నాం. ఒక్కొక్కటి చనిపోతుంటే ఏం చేయాలో తెలియడం లేదు.

- మల్‌గొండ

ప్రభుత్వం ఆదుకోవాలి

చనిపోయిన గొర్రెల స్థానంలో తిరిగి జీవాలను ఇప్పించాలి. పశువైద్యులు సిబ్బంది, మందులను అందుబాటులో ఉంచాలి. గొర్రె కాపరులకు ఇన్సూరెన్స్ ఇవ్వాలి.

- సాయిలు, గొర్రె కాపరుల సంఘం అధ్యక్షులు

వైద్యం అందిస్తాం

సబ్సిడీ గొర్రెలకు వైద్యం చేస్తాం. దూర ప్రాంతం నుంచి తేవడం వల్ల గొర్రెలు మృతి చెందుతున్నాయి. వాటికి ఇన్సూరెన్స్ వస్తుంది. సిబ్బంది, మందుల కొరత ఉంది. గొర్రెల మృతిపై విచారణ చేస్తాం.

-శ్రీనివాస్
ఇన్‌చార్జి పశువైద్యాధికారి

అంతర్‌జిల్లా అథ్లెటిక్స్‌లో సత్తాచాటిన మనోళ్లు

కాగజ్‌నగర్: కుమరం భీం జిల్లా కాగజ్‌నగర్ పట్టణంలోని అంతర్ జిల్లాల నవోదయ అథ్లెటిక్, సైన్స్ ఫెయిర్ పోటీలు మంగళవారంతో ముగిశాయి. మంగళవారం ఉదయం జావెలిన్ త్రో, లాంగ్ జంప్, 100 మీటర్ల పరుగు పందెం, 800 ట్రాక్ మీటర్లు, 5 కిలోమీటర్ల పరుగు పందెం, హర్డిల్స్, ట్రిపుల్ జంప్, షాట్‌పుట్ పోటీలు నిర్వహించారు. ఈ పోటీలు సాయంత్రం వరకు సాగాయి. అనంతరం ముగింపు సమావేశం ఏర్పాట్లు చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులు ప్రదర్శించిన వివిధ కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో పీడీలు, నవోదయా విద్యాలయం సిబ్బంది, 9 జిల్లాల నుంచి వచ్చిన క్రీడాకారులు పాల్గొన్నారు.

విజేతలు వీరే..

అథ్లెటిక్ విభాగంలో అంతర్ జిల్లా నవోదయ స్థాయిలో గెలుపొందిన క్రీడాకారుల వివరాలను నిర్వాహకులు, ప్రిన్సిపాల్ మంగళవారం సాయంత్రం ప్రకటించారు. అండర్-19 విభాగంలో డిస్కస్ త్రో ఎల్.వెంకట్(వరంగల్) ప్రథమ, కె.పరశురాం(మహబూబ్‌నగర్) ద్వితీయా, బి.నిశిత్(మెదక్) తృతీయ, హైజంప్ విభాగంలో పి.సాయికుమార్ (ఆదిలాబాద్) ప్రథమ, ఎం.సాయిప్రదీప్(రంగారెడ్డి) ద్వితీయ, 5 కిలోమీటర్ల పరుగుపందెంలో ఎ.కార్తీక్(ఆదిలాబాద్) ప్రథమ, వి.చంద్రశేఖర్(రంగారెడ్డి) ద్వితీయ, ఎ.పృద్వీరాజ్(మెదక్) తృతీయ, 5 కిలోమీటర్ల నడకలో జె.ఉదయ్(వరంగల్) ప్రథమ, ఎన్.సాయికార్తిక్(ఆదిలాబాద్) ద్వితీయ, 800 మీటర్ విభాగంలో వై.బార్గవ్(నల్గొండ) ప్రథమ, ఎం.అకాష్(మెదక్) ద్వితీయ, అండర్-19 బాలికల విభాగంలో లాంగ్ జంప్ యు.స్వర్ణలత(మెదక్) ప్రథమ, బీసీ మహేశ్వరీ(మహబూబ్‌నగర్) ద్వితీయ, ఆర్.సాయి ప్రసన్న(ఆదిలాబాద్) తృతీయ సాధించినట్లు ప్రిన్సిపాల్ తెలిపారు. అలాగే డిస్క్ త్రోలో డి.లిఖిత(కరీంనగర్) ప్రథమ, డి.అఖిల(మహబూబ్‌నగర్) ద్వితీయ, 800 మీటర్ల ట్రాక్ ఈవెంట్‌లో టి.గౌతమి(మహబూబ్‌నగర్) ప్రథమ, ఎం.విజయలక్ష్మి(ఆదిలాబాద్) ద్వితీయ, 200 మీటర్ల ట్రాక్ ఈవెంట్‌లో బి.నిహారిక(మహబూబ్‌నగర్) ప్రథమ, వి.మనుష(ఆదిలాబాద్) ద్వితీయ, షాట్‌పుట్‌లో కె.పవిత్ర(మెదక్)ప్రథమ, బీసీ మహేశ్వరీ(మహబూబ్‌నగర్) ద్వితీయ, ఎ.శిరిష(ఆదిలాబాద్) తృతీయ, ట్రిపుల్ జంప్ విభాగంలో కె.రవలి(మెదక్) ప్రథమ, బీసీ మహేశ్వరీ(మహబూబ్‌నగర్) ద్వితీయ, ఆర్.రాజేశ్వరీ(ఆదిలాబాద్) తృతీయ, హైజంప్‌లో లక్ష్మీబార్గవి(నల్గొండ) ప్రథమ, 100 మీటర్ల హర్డిల్స్ యు.స్వర్ణలత(మెదక్) ప్రథమ, 5కిలో మీటర్ల పరుగు పందెంలో డి.అఖిల(మహబూబ్‌నగర్) ప్రథమ స్థానంలో నిలిచారు. అండర్-17 బాలుర విభాగంలో హై జంప్‌లో పి.అనీల్‌కుమార్(ఆదిలాబాద్) ప్రథమ, ఎం.జగపత్‌నాయక్(మహబూబ్‌నగర్) ద్వితీయ, 100 మీటర్స్ విభాగంలో కె.దినేష్(మహబూబ్‌నగర్) ప్రథమ, ఎల్.ఈశ్వర్(వరంగల్) ద్వితీయ, ఎస్.దత్తు(నిజామాబాద్) తృతీయ, 3 కిలోమీటర్ల రన్నింగ్ విభాగంలో కుమార్ శంకర్(రంగారెడ్డి) ప్రథమ, జి.అఖిల్ (వరంగల్) ద్వితీయ, ఎం.జగపతి నాయక్(మహబూబ్‌నగర్) తృతీయ, లాంగ్ జంప్ విభాగంలో ఎం.కృష్ణ(నల్గొండ) ద్వితీయ, బయాఖాన్(రంగారెడ్డి) తృతీయ స్థానాల్లో నలిచారు.

మల్లన్న సాగర్ నిర్వాసితులకు పరిహారం



పూజలు చేస్తున్న సిద్దిపేట కలెక్టర్ దంపతులు

కొండపాక: కొమురవెల్లి మల్లన సాగర్ రిజర్వాయర్ కోసం భూములు ఇచ్చిన రైతులు స్థిరాస్తుల పరిహారం త్వరలోనే అందిస్తామని జిల్లా కలెక్టర్ వెంకట్రామరెడ్డి తెలిపారు. కొండపాక మండలం మర్పడగలోని విజయదుర్గా సమేత సంతాన మల్లికార్జున స్వామి క్షేత్రంలో మంగళవారం ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా విలేకరులు అడిగిన ప్రశ్నలకు పలు విషయాలు తెలిపారు. మల్లన్న సాగర్ భూ సేకరణ మరికొంత ఉందని, భూములు ఇవ్వని వారికి 2013 చట్టం ప్రకారం పరిహారం బ్యాంకుల్లో జమ చేస్తామని ఈ ప్రక్రియ నెల రోజుల్లో జరుగుతుందన్నారు. ఇంతకు ముందే భూములు ఇచ్చిన రైతుల స్థిర ఆస్తుల పరిహారం త్వరలోనే ప్రభుత్వం చెల్లిస్తుందన్నారు. హరితహారంలో నాటిన మొక్కలు కాపాడిన గ్రామాలకు ప్రోత్సాహకాలు ఇస్తామన్నారు. ఒక్క మొక్క కూడా చనిపోకుండా కాపాడిన గ్రామాలకు రూ.25 వేలు ప్రోత్సాహకం అందిస్తామన్నారు. మొక్కలను కాపాడే వారికి సైకిళ్ల ఇస్తున్నట్లు తెలిపారు.

మర్పడగ క్షేత్రంలో కలెక్టర్ దంపతుల ప్రత్యేక పూజలు

కొండపాక మండలం మర్పడగలోని విజయదుర్గసమేత సంతాన మల్లికార్జున స్వామి క్షేత్రంలో కలెక్టర్ వెంకట్రామరెడ్డి దంపతులు ప్రత్యేక పూజలు చేశారు. క్షేత్ర వ్యవస్థాపకులు చెప్పెల హరినాథశర్మ ఆధ్వర్యంలో మల్లికార్జున స్వామికి విజయదుర్గా మాతకు పూజలు చేయించారు. కలెక్టర్ దంపతులను హరినాథశర్మ ఆలయ మర్యాదలతో సత్కరించారు. అనంతరం క్షేత్రం ఆవరణలో కలెక్టర్ సతీమణి మొక్కను నాటారు.

మల్లన్న ఆలయ అభివృద్ధి పనులపై సమీక్ష

దేవాదాయశాఖ జాయింట్ కమిషనర్ కృష్ణవేణి రాక

చేర్యాల: ప్రముఖ శైవక్షేత్రం కొమురవెల్లి మల్లికార్జునస్వామి దేవాలయ సందర్శనార్థం వచ్చే భక్తుల సౌకర్యార్థం గతంలో ప్రతిపాదించిన పలు అభివృద్ధిపనుల నిర్వహణపై దేవాదాయశాఖ ఉన్నతాధికారులు మంగళవారం సమీక్షించారు. ఈమేరకు దేవాదాయ శాఖ జాయింట్ కమిషనర్ కృష్ణవేణి, ఎస్.ఈ.వెంకటరమణ, ఈఈ పురుషోత్తంలు మల్లన్న ఆలయాన్ని సందర్శించి అభివృద్ధి పనుల సంబంధిత విషయమై సమీక్షించారు. 100గదుల సత్రం, డార్మిటరీ, ఆరుగదుల చౌల్ట్రీ, ప్రత్యేక దర్శన క్యూలైన్‌లో టాయిలెట్స్ ఏర్పాటు ఇతరత్రా పనులకు సుమారు రూ.4కోట్లపై చిలుకు మేర నిధుల మంజూరు చేయాలని దేవాలయ ఈవో రామకృష్ణారావు కొన్నాళ్లక్రితం ప్రతిపాదనలు దేవాదాయశాఖ కమిషనర్‌కు అందించారు. ఈ విషయమై దేవాదాయశాఖ జాయింట్ కమిషనర్ కృష్ణవేణి ప్రతిపాదిత పనుల నిర్వహణకు సంబంధించిన స్థలపరిశీలన జరిపారు. 100గదుల సత్రం నిర్మాణాన్ని మాస్టర్‌ప్లాన్‌లో పొందుపరచాలని సూచించారు. ఆరుగదుల చౌల్ట్రీతో పాటు ఇతరత్రావాటికి అనుకూలత వ్యక్తంచేశారు. దీంతో త్వరలోనే నిధులు మంజూరు కానుండటంతో ఆలయంలో పలు అభివృద్ధిపనులు ప్రారంభమవుతాయన్న ఆశాభావం వ్యక్తంచేశారు. ఈసందర్భంగా ఈవో రామకృష్ణారావు, సూపరింటెండెంట్ రావుల సుదర్శనం తదితరులుఉన్నారు.

జర్నలిస్టు పిల్లలకు ప్రైవేటు బడుల్లో ఉచిత విద్యనందించాలని ఉత్తర్వులు

సిద్దిపేట టౌన్: సిద్దిపేట జిల్లా వ్యాప్తంగా వివిధ పత్రికల్లో, ఎలక్ట్రానిక్ మీడియా ఛానళ్లలో పనిచేస్తున్న జర్నలిస్టుల పిల్లలకు ప్రైవేటు పాఠశాలల్లో ఉచిత విద్యనందించాలని డీఈవో కృష్ణారెడ్డి మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. టీయూడబ్ల్యూజే ఆధ్వర్యంలో ఇటీవల జర్నలిస్టుల పిల్లలకు ప్రైవేటు బడుల్లో ఉచిత విద్యనందించేలా ఉత్తర్వులు జారీ చేయాలని మంత్రి హరీశ్‌రావు, డీఈవోలకు వినతిపత్రం అందించారు. మంత్రి హరీశ్‌రావు సూచనమేరకు, జర్నలిస్టు సంఘం విజ్ఞాపన మేరకు జిల్లా వ్యాప్తంగా జర్నలిస్టుల పిల్లలందరికీ ఉచిత విద్య అందించాలని అన్ని ప్రైవేటు పాఠశాలలకు డీఈవో ఉత్తర్వులు జారీ చేశారు. ఈ ఉత్తర్వులు ఇప్పించిన మంత్రి హరీశ్‌రావుకు, డీఈవోకు జర్నలిస్టు సంఘం తరపున ప్రత్యేక ధన్యవాదాలు తెలుపుతున్నట్లు టీయూడబ్ల్యూఎస్ సిద్దిపేట జిల్లా అధ్యక్షులు కె.రంగాచారి, ఎల్.రవిచంద్ర, కూతురు రాజిరెడ్డి, పాండు, యాదవరెడ్డి, అరుణ్, దుర్గారెడ్డి, బబ్బురు రాజు, రఘునందన్, పెద్ది సుభాష్, కత్తుల శ్రీనివాస్‌రెడ్డి, నెల్లుట్ల రమణారావు, చంద్రమౌళి, నంట శ్రీనివాస్, స్వామి, మజ్జు, సత్యనారాయణ రెడ్డి, సంజీవరెడ్డి, శ్రీరాం, పాతర్ల వెంకటేశ్వర్లు, ఖలీముర్రహమాన్, ఫయాజ్ హఫీజ్ , యూసుఫ్, మైసారెడ్డి, మంద జనార్దన్, జీకురు పరమేశ్వర్, అశోక్, యాదగిరి, బింగి శ్రీనివాస్ తదితరులు తెలిపారు. ప్రైవేటు పాఠశాలల యాజమాన్యాలు సహృదయంతో సహకరించి ఉత్తర్వులు అమలు జరిగే విధంగా చొరవ తీసుకోవాలని జర్నలిస్టు సంఘం పక్షాన కోరుతున్నామని వారు తెలిపారు. జర్నలిస్టు మిత్రులందరూ ప్రైవేటు స్కూల్ యాజమాన్య మిత్రులతో పరస్పర సహకార భావనతో ఉత్తర్వులు అమలు జరిగే విధంగా స్నేహపూర్వకంగా వ్యవహరించాలని కోరుతున్నాము.

చట్టవ్యతిరేక కార్యకలాపాలపై నిఘా పెట్టండి

ఎస్పీ చందనాదీప్తి



మాట్లాడుతున్న ఎస్పీ చందనాదీప్తి



హాజరైన పోలీసు అధికారులు

మెదక్ క్రైం: జిల్లాలో చట్ట వ్యతిరేక కార్యక్రమాలపై ప్రత్యేక నిఘా ఉంచాలని జిల్లా ఎస్పీ చందనా దీప్తి పోలీసులకు ఆదేశించారు. మంగళవారం జిల్లా పోలీసు కార్యాలయంలో నేరాలపై సమీక్ష సమావేశం జరిగింది. ఈసందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ పెండింగ్‌లో ఉన్న కేసులను త్వరితగతిన విచారణ జరపాలని ఆదేశించారు. ఏటీఎం మోసాలు, సైబర్ నేరాలపై ప్రజలకు అవగాహన కల్పించాలని ఆదేశించారు. ఇలాంటి మోసాలు చేసేవారిపై ప్రత్యేకదృష్టి సారించాలని చెప్పారు. జిల్లాలో పెండింగ్‌లో ఉన్న నాన్‌బెయిలెబుల్ వారెంట్లను అమలు చేయాలని ఆదేశించారు. ఇసుక మాఫియా, గ్యాబ్లింగ్, బెట్టింగ్ లాంటి చట్ట వ్యతిరేక కార్యక్రమాలపై ప్రత్యేక నిఘా ఉంచి అక్రమార్కుల భరతం పట్టాలని చెప్పారు. దొంగతనాల నివారణకు పగలు, రాత్రి వేళల్లో పెట్రోలింగ్ నిర్వహించాలని సూచించారు. రోడ్డు ప్రమాదాలు జరగకుండా మూలమలుపుల్లో, ప్రమాదాలుజరిగే చోట సూచిక బోర్డులు ఏర్పాటు చేయాలని తెలిపారు. ద్విచక్రవాహనదారులు హెల్మెట్లు ఖచ్చితంగా ధంచేలా చూడాలన్నారు. గణేష్, బక్రీద్ పండలు ఒకేసారి రావడంతో జిల్లాలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా గట్టి బందోబస్తు ఏర్పాటు చేయాలని చెప్పారు.

శాంతిభద్రతలకు విఘాతం కలిగించే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. పండుగలకు శాంతియుత వాతావరణంలో జరిగేలా చూడాలన్నారు. వినాయక మండపాల వద్ద మైకులు నిషేదించి శబ్దకాలుష్యం లేకుండా చూడాలని ఆదేశించారు. ఈసమావేశంలో అదనపు ఎస్పీ రాంచంద్రారెడ్డి, తూప్రాన్, మెదక్ సబ్‌డివిజన్ పరిధిల్లోని సీఐలు, ఎస్ఐలు పాల్గొన్నారు.

ఆత్మవిశ్వాసంతో విద్యనభ్యసించాలి

జిల్లా ఇంటర్ బోర్డ్ నోడల్ అధికారి నర్సింలు



మాట్లాడుతున్న ఇంటర్ నోడల్ అధికారి నర్సింలు

మెదక్ అర్బన్: దృఢచిత్తం, ఆత్మవిశ్వాసంతో విద్యనభ్యసించాలని బోర్డ్ ఆఫ్ ఇంటర్మీడియేట్ జిల్లా నోడల్ అధికారి డాక్టర్ నర్సింలు పేర్కొన్నారు. మంగళవారం మెదక్‌లోని మాయ గార్డెన్‌లో సిద్దార్థ ఆదర్శ జూనియర్ కళాశాల ఆధ్వర్యంలో నిర్వహించిన ఫ్రెషర్స్ డే కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. విద్యా బుద్ధులు నేర్పే గురువులు సమాజానికి రుషులని వారిని గౌర వించడం నేర్చుకోవాలన్నారు. ఉపాధ్యాయులు చెప్పే విషయాలు జాగ్రత్తగా విని గ్రహణశక్తిని పెంచుకోవాలన్నారు. కళాశాల కరస్పాండెంట్ శ్రీనివాస్ చౌదరి మాట్లాడుతూ పోటీ తత్వంతో చదువాలని, క్రమశిక్షణ, మానవీయ విలువలతో కూడిన విద్యనభ్యసించాలన్నారు. మానవ వనరులు ఉపయోగించుకుంటే దేశం అభివృద్ధి పథంలో నడుస్తుందన్నారు. అనంతరం ఇంటర్ వార్షిక పరీక్ష ల్లో అధిక మార్కులు సాధించిన ప్రజ్ఞ, స్నేహ, సంధ్యలకు బహుమతులు అందజేశారు. నృత్యాలు, నాటికలు, మిమిక్రీ, పాటలు, ఆటలతో ఉత్సాహంగా విద్యార్థులు స్వాగత కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్లు సాంబశివ రావు, బాపారావు, రమేశ్, ప్రిన్సిపల్ రవీందర్, అధ్యాపకులు మచ్చేందర్, సాయిబాబ, ప్రవీణ్, వెంకటేశ్, విజయ, ప్రతిభ, హేమలత పాల్గొన్నారు.



నృత్యాలు చేస్తున్న విద్యార్థినులు

ఘనంగా చిరంజీవి జన్మదిన వేడుకలు



మాట్లాడుతున్న పారిశ్రామిక వేత్త అరవ రామకృష్ణ

రామచంద్రాపురం: రామచంద్రాపురం పట్టణంలో ప్రముఖ సినీ నటుడు చిరంజీవి జన్మదిన వేడుకలను మంగళవారం ఘనంగా నిర్వహించారు. పట్టణంలోని శ్రీ కృష్ణదేవ రాయ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈఎస్ఐ ఆసుపత్రిలోని రోగులకు చిరంజీవి జన్మదిన సందర్భంగా పండ్లను పంచిపెట్టారు. అనంతరం జన్మదిన కేక్‌ను కట్‌చేసి ఒకరికొకరు శుభాకాంక్షలు తెలియజేసుకున్నారు. ఈ సందర్భంగా ప్రముఖ పారిశ్రామిక వేత్త, యూత్ గౌరవ అధ్యక్షులు అరవ రామకృష్ణ మాట్లాడుతూ చిరంజీవి నటించిన పలు సామాజిక చిత్రాలతో సమాజంలో పెనుమార్పులు చోటు చేసుకున్నాయన్నారు.

జాతీయ ప్రతిభ పురస్కారాలకు 'గీతా' విద్యార్థుల ఎంపిక



ప్రీతి



సంగమేశ్వర్



అనూష



వాణిశ్రీ



గాయత్రి చారి



వర్ష



మౌనిక



జ్యోత్స్నశ్రీ



షేక్ వసీమ్ అక్రమ్

మెదక్ అర్బన్: జాతీయ ప్రతిభ పురస్కారాలకు 2016-17 విద్యాసంవత్సరానికి మెదక్ గీతా కళాశాలకు చెందిన 18 మంది విద్యార్థులు ఎంపికైనట్లు ప్రిన్సిపల్ శ్రీశైలం తెలిపారు. ప్రతిభ పురస్కారానికి ఎంపికైన విద్యార్థులకు డిగ్రీలో మూడు సంవత్సరాల పాటు రూ. 10 వేల చొప్పున, పీజీలో రెండేళ్ల పాటు రూ. 20 వేల చొప్పున ఉపకార వేతనం అందుతుందన్నారు. ఎంపీసీ విభాగంలో ప్రీతి, ఆర్. సంగమేశ్వర్, అనూష, జ్యోత్స్నశ్రీ, వసీమ్ అక్రమ్, సాయియశ్వంత్, హరిత, దివ్య, మోహన్, వీణ, బైపీసీలో వాణిశ్రీ, గాయత్రి, చారి, అఖిల, భవాని, వర్ష, బుష్రజబీన్, నిమిష, సీఈసీలో మౌనిక మొత్తం 18 మంది విద్యార్థులు ఎంపికయ్యారు. ఎంపికైన విద్యార్థులను కరస్పాండెంట్ ప్రసాద్‌రావు, వైస్ ప్రిన్సిపల్ రాంచందర్‌రావు, అధ్యాపకులు రామారావు, రమేశ్, శ్రీనివాస్, శ్రీధర్, జ్యోతి, నిశాంత్, శశికుమార్, సాయిరాం తదితరులు అభినందించారు.

కలెక్టరేట్ స్థల ఎంపికలో
జాప్యమెందుకు?

- రాజకీయ లబ్ధి ఉంటే ఊరుకోం
- ప్రజలను ఇబ్బందిపెట్టే విధంగా ఉండొద్దు
- ఆర్డీవో కార్యాలయ సమీపంలోనే ఉండేలా చూడండి
- స్వార్థం కోసం దూరప్రాంతాన్ని ఎంపిక చేస్తే ఆందోళన
- మాజీ మంత్రి, డీసీసీ అధ్యక్షురాలు సునీతాలక్ష్మారెడ్డి



ఉద్యోగుల ఆందోళనకు మద్దతు తెలుపుతున్న సునీతారెడ్డి

మెదక్ రూరల్: జిల్లా సమీకృత కలెక్టరేట్ నిర్మాణం ప్రజలకు అందుబాటులో ఉండే విధంగా స్థల ఎంపిక చేపట్టాలని మాజీ మంత్రి, ఉమ్మడి జిల్లా డీసీసీ అధ్యక్షురాలు సునీతాలక్ష్మారెడ్డి కోరారు. మంగళవారం మెదక్‌లోని ద్వారకా గార్డెన్‌లో విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ.. ప్రభుత్వం కొత్త జిల్లాలను ఏర్పాటు చేసి యేడాది కావస్తున్నా సమీకృత కలెక్టరేట్ స్థలం ఇంకా ఎందుకు ఎంపిక చేయడంలేదని ప్రశ్నించారు. ఆర్డీవో కార్యాలయ సమీపంలోనే ప్రభుత్వం నిర్మాణం చేపడితే అందరికీ సౌకర్యంగా ఉంటుందని కోరుకుంటున్నారన్నారు. ప్రజలు విస్మరించి రాజకీయ లబ్ధికోసం పట్టణానికి దూరప్రాంతంలో నిర్మిస్తే కాంగ్రెస్‌పార్టీ ఊరుకోదని హెచ్చరించారు. మీ స్వార్థం కోసం జిల్లా ప్రజలు వ్యయ ప్రయాసలకు గురయ్యే విధంగా కలెక్టరేట్‌ను నిర్మిస్తే ఊరుకునేది లేదని పేర్కొన్నారు. స్వచ్ఛంద సంస్థలు, పట్టణ యువత వేలాది మంది నుంచి ప్రజాభిప్రాయం సేకరిస్తే 99శాతం మంది ప్రజలు ఆర్డీవో కార్యాలయంలోనే భవనాన్ని నిర్మించాలని కోరుకుంటున్నట్లు పేర్కొన్నారు. గతంలో తాను మంత్రిగా ఉన్నప్పుడు మెదక్ ఆర్డీవో కార్యాలయానికి రూ.2 కోట్లు మంజూరు చేయిస్తే ఆ నిధులను సిద్దిపేటకు తరలించా రని ఆరోపించారు. ఆర్డీవో కార్యాలయ ఆవరణలో కలెక్టరేట్ నిర్మిస్తారన్న సాకు చూపెట్టి నిధులు తరలించారని విమర్శించారు. కానీ ప్రస్తుతం ఆర్డీవో కార్యాలయ భవనాలు చారిత్రక కట్టడాలుగా సాకు చూపించి కలెక్టరేట్‌ను మరో చోటుకి మార్చే విధంగా కుట్రలు పన్నుతున్నారని విమర్శించారు. ఈ ప్రాంతంలో నిర్మించడం వల్ల అన్నింటికి సౌలభ్యంగా ఉంటుందని సూచించారు. కాంగ్రెస్‌పార్టీ ప్రజల పక్షాన పోరాటం చేస్తుందే తప్ప రాజకీయ ప్రయోజనాలు ఉండవన్నారు. తాము చేస్తున్న ప్రతి పోరాటం ప్రజాహితం కోసమేనన్నారు. జిల్లా కలెక్టరేట్ కార్యాలయంలో వినతి పత్రాన్ని అందజేశారు. సమావేశంలో కాంగ్రెస్ నాయకులు కంఠారెడ్డి తిరుపతిరెడ్డి, సుప్రభాతరావు, మామిళ్ల ఆంజనేయులు, తొడుపునూరి చంద్రపాల్, గూడూరి ఆంజనేయులుగౌడ్, మేడి మధుసూదన్‌రావు, కిషన్‌గౌడ్, జడ్పీటీసీ శ్రీనివాస్‌రెడ్డి, రబ్బిన్‌దివాకర్, ఎంపీటీసీ శ్రీకాంత్‌తో పాటు పలువురు కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

సమాఖ్య సంఘ సభ్యులకు సంఘీభావం

కలెక్టరేట్ సమీపంలో నివరధిక సమ్మె చేస్తున్న ఐకేపీ జిల్లా, మండల స్థాయి ఉద్యోగుల సంఘం సభ్యులకు మాజీ మంత్రి సునీతారెడ్డి సంఘీభావం తెలిపారు. పేదరిక నిర్మూలనలో తమవంతు పాత్ర వహిస్తున్న మండల సమాఖ్య అకౌంటెంట్, కంప్యూటర్ ఆపరేటర్, అటెండర్ ఉద్యోగుల న్యాయమైన డిమాండ్లను తీర్చాలని కోరారు. కనీస వేతనం రూ. 18,500 చెల్లించాలని, ఆరోగ్యభద్రత, ఉద్యోగ బీమా కల్పిస్తూ వారు కోరిన సమస్యలను తీర్చాలని కోరారు.

బ్యాంకు ఉద్యోగుల సమ్మెతో
నిలిచిన లావాదేవీలు



జిల్లా కేంద్రంలో మూతబడిన ఎస్‌బీఐ బ్యాంకు

మెదక్ అర్బన్: బ్యాంకింగ్ రంగంలో ప్రభుత్వం చేపట్టిన ప్రజా వ్యతిరేక సంస్కరణలకు నిరసనగా చేపట్టిన సమ్మెతో మంగళవారం జిల్లా వ్యాప్తంగా ప్రభుత్వ రంగ బ్యాంకులు మూతపడ్డాయి. లావాదేవీలు నిలిచి పోయాయి. దీంతో ఖాతాదారులు ఇబ్బంది పడ్డారు. బ్యాంకు ఉద్యోగులు సమ్మెబాట పట్టడంతో ఎస్‌బీఐ, ఎస్‌బీహెచ్ బ్యాంకులను మూసివేశారు.

కురిసేదెంత.. కొలిచేదెంత?

- వర్షపాతం నమోదులో లోపించిన శాస్త్రీయత
- కాలం చెల్లిన రెయిన్‌గేజ్‌లపైనే ఆధారపడుతున్న అధికారులు
- అరకొరగా ఆటోమేటిక్ వాతావరణ కేంద్రం
- బీమాపై ప్రభావం చూపుతున్న నివేదికలు
- పరిహారం అందక నష్టపోతున్న రైతులు

మెదక్ అర్బన్: వర్షాభావ పరిస్థితులను అంచనా వేయడంలో.. వర్షపాత నమోదు ప్రక్రియ కీలకం. కరువును అంచనా వేయడం, అతివృష్టి, అనావృష్టి తీవ్రతను తెలియజెప్పడంలో రోజువారీగా నమోదు ప్రక్రియలే ప్రధానం. ఏ మాత్రం తప్పుగా నమోదు చేసినా రైతులకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి అందే సహాయంతో కోతపడే ప్రమాదం ఉంది. ఆయా మండలాల్లో కురిసే వర్షాన్ని బట్టి అధికారులు ప్రత్యేక ప్రణాళికలు నిర్ధారించడంలో ఇవి కీలక పాత్ర పోషిస్తాయి. అయితే వర్ష పాత నమోదు కోసం కాలం చెల్లిన రెయిన్‌గేజ్‌లపై అధికారులు ఆధారపడుతున్నారు. వర్షపాత నమోదు కేంద్రాలను పర్యవేక్షించాల్సిన సహాయ గణాంకాధి కారుల నిర్లక్ష్యం కారణంగా చినుకుల లెక్కల్లో శాస్త్రీయత కొరవడుతున్నది. ఇంకా పురాతన పద్ధతుల్లోనే వర్షపాతాన్ని లెక్కగట్టడంతో నివేదికలన్నీ తప్పుల తడకగా మారుతున్నాయి. మండలాల్లో ఆటోమెటిక్ వాతావరణకేంద్రాలను ఏర్పాటు చేసినప్పటికీ అవి పక్కాగా సమాచారాన్ని సేకరించడంలో అనుకున్న ఫలితాన్ని రాబట్ట లేకపోతున్నాయి. జిల్లాలోని అన్ని మండల కేంద్రాల్లో తహసీల్దార్ కార్యాలయాల పరిధిలో ఏర్పాటు చేసిన రెయిన్ గేజ్‌ల ఆధారంగా వర్షపాత నమోదును అంచనా వేస్తున్నారు. జిల్లాలో ప్రస్తుతం 34 ఆటోమెటిక్ వాతావరణ కేంద్రాలు, 15 రెయిన్‌గేజ్‌లు ఉన్నాయి. ఈ ఆటోమేటిక్ వాతావరణ కేంద్రాల నిర్వహణను తెలంగాణ రాష్ట్ర అభివృద్ధి ప్రణాళిక సంస్థ (టీఎస్‌డీపీఎస్) చూస్తున్నది. పాత కాలం నాటి



జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన మాన్యువల్ రెయిన్‌గేజ్

రెయిన్‌గేజ్‌లపై ఆధారపడి వాస్తవ వర్షపాత నమోదును పొందలేకపోతున్నామని గుర్తించి ఆటోమేటిక్ వాతావరణ కేంద్రాలను ఎక్కువ శాతం సబ్ స్టేషన్ల ఆవరణలో ఏర్పాటు చేశారు. వీటిలో ఏర్పాటు చేసిన చిప్ దాని పరిధిలోని వర్షపాతం, వాయువేగం, ఎండ తదితర వివరాలతో కూడిన వాతావరణ నివేదికను ప్రతి గంటకో సారి ప్రణాళిక సంస్థ కార్యాలయంలోని ప్రధాన సర్వర్‌కు మెసేజ్ రూపంలో సమాచారం చేరవేస్తుంది. నిపుణులు చెబుతున్న ప్రకారం ఈ వాతావరణ కేంద్రాలను దాని పరిధిలోని 3 నుంచి 5 కి.మీ. లోపు మాత్రమే వాతావరణ పరిస్థితులను అంచనా వేస్తాయి. ఇప్పటి వరకు అనుసరిస్తున్న విధానం ప్రకారం ఒక వర్షపు రోజు, మరో వర్షపు రోజుకు మధ్య 15 రోజుల వ్యత్యాసం ఉంటేనే ఆ ప్రాంతంలో కరువు ప్రభావం ఉన్నట్లు పరిగణిసు న్నారు. జిల్లాలో ఒక్కో మండలం సుమారుగా 20 నుంచి 30 కి.మీ. విస్తీర్ణం కలిగి ఉంది. కేవలం మండల కేంద్రంలోనే వాతావరణ కేంద్రాలను ఏర్పాటు చేసి వాటి ఆధారంగా లెక్కగడుతున్నారు.

తప్పుల తడకగా నివేదికలు

వర్షపు చినుకుల లెక్కల్లో శాస్త్రీయత కొరవడుతోంది. ఇంకా పురాతన పద్ధతుల్లోనే వర్షపాతాన్ని లెక్కగట్టడం వల్ల నివేదికలన్నీ తప్పుల తడకగా మారుతున్నాయి. తీవ్ర సమస్యలు తలెత్తుతున్నాయి. ఏటా కురుస్తున్న వర్షపాత ఆధారంగానే కరువు అంచనా, వ్యవసాయ ప్రణాళికలు, పంట బీమా చెల్లింపులు జరుగుతుంటాయి. ఇంతటి ప్రాధాన్యం కలిగిన వర్షపాతం నమోదులో ఇప్పటికీ ఆధునిక పరిజ్ఞానం అందుబాటులోకి రాకపోవడంతో అధికారుల అంచనాలు తారుమారై రైతులు నష్టపోతున్నారు.

కరువు అంచనాల్లో ఇబ్బందులు

ఇప్పటి వరకు అనుసరిస్తున్న విధానం ప్రకారం ఒక వర్షపు రోజు నుంచి మరో వర్షపు రోజుకు మధ్య 15 రోజుల వ్యత్యాసం ఉంటేనే ఆ ప్రాంతంలో కరువు ప్రభావం ఉన్నట్లుగా అధికారులు పరిగణిస్తారు. అంటే 2.5 మి.మీ.పై కురిసిన వర్షపాతాన్ని ఒక వర్షపు రోజుగా గుర్తిసారు. ఇంతగా ప్రాధాన్యం ఉన్న వర్షపాతం నమోదుపై అధికారులు నిర్లక్ష్యం చూపడంపై అంతటా ఆందోళన వ్యక్తమవుతుంది. అసలు వర్షపాతం అంచనాలే తలకిందులు కావడంతో కరువు ప్రాంతాల గుర్తింపు అశాస్త్రీయంగా ఉండడంతో పాటు ప్రభుత్వ కరువు సాయం అందడం లేదు.

మండల కేంద్రాలకే పరిమితం

జిల్లాలో ఒక్కో మండలం సుమారుగా 20 నుంచి 30 కి.మీ. విస్తీర్ణం కలిగి ఉంది. కేవలం మండల కేంద్రంలోనే వర్షపాత సూచిక కేంద్రాలను ఏర్పాటు చేసి వాటి ఆధారంగా వర్షపాతాన్ని అధికారులు లెక్కగడుతున్నారు. అలాగే వీటి నిర్వహణ బాధ్యతను, లెక్కింపు ప్రక్రియను మండల సహాయ గణాంక అధికారికి అప్పగించారు. కానీ ఇప్పటికీ కొన్ని మండలాల్లో అధికారులు అందుబాటులో లేకపోవడంతో తహసీల్దార్ కార్యాలయంలో పనిచేసే కింది స్థాయి సిబ్బందే వర్షపాతాన్ని లెక్కగడుతూ రికార్డుల్లో నమోదు చేస్తున్నారు. క్షేత్ర స్థాయి అధికారులు లెక్కల ఆధారంగానే ఉన్నతాధికారులు నివేదికలను రూపొందిస్తూ ప్రభుత్వానికి పంపుతున్నారు.

పంట బీమాపై ప్రభావం

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రైతుల సంక్షేమం కోసం ప్రవేశపెట్టిన పంటల బీమా పథకాల్లో ప్రీమియం చెల్లిస్తున్న రైతులను పంట నష్టాని అందించే అవకాశం ఉంటుంది. పలు బీమా కంపెనీలు వెదర్ స్టేషన్ల సమాచారం ఆధారంగానే బీమా చెల్లింపులు చేసేందుకు ఆసక్తి చూపుతున్నాయి. అవి అందించే వివరాలకు, రెవెన్యూ అధికారులు సేకరించి సమాచారానికి ఎలాంటి పొంతన లేకుండా పోతోంది.

ప్రాజెక్టులను ఆపే కుట్రలు మానుకోండి

- ప్రతిపక్షాలు అడ్డుపడడం సరికాదు
- మల్లన్నసాగర్‌తో జిల్లా సస్యశ్యామలం
- త్వరలో ఘణపురం ప్రాజెక్టు ఎత్తు పనులు
- ప్రాజెక్టులంటేనే కాంగ్రెసోళ్లకు భయం
- ప్రజలు మర్చిపోతారనే అడ్డుకుంటున్నారు
- మత్స్యకారులకు ప్రత్యేక నిధులు
- వందశాతం సబ్సిడీపై చేపపిల్లల పంపిణి
- సదస్సులో డిప్యూటీస్పీకర్ పద్మారెడ్డి

మెదక్ రూరల్, మెదక్ అర్బన్: రాష్ట్రాన్ని సస్యశ్యామలం చేయాలనే సంకల్పంతో నిర్మిస్తున్న కాళేశ్వరం, మల్లన్నసాగర్ ప్రాజెక్టులను నిర్మిస్తే అడ్డుపడడం మానుకోవాలని, గత ప్రభుత్వాలు ప్రజలకు ఏం చేశాయని ప్రతిపక్షాలపై ఉపసభాపతి పద్మాదేవేందర్‌రెడ్డి మండిపడ్డారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని క్యాంపు కార్యాలయంలో విలేకరుల సమావేశంలో నర్సాపూర్ ఎమ్మెల్యే మదన్‌రెడ్డితో కలిసి డిప్యూటీ స్పీకర్ మాట్లాడారు. మల్లన్నసాగర్, కాళేశ్వరం ప్రాజెక్టుల ద్వారా ప్రతి నియోజకవర్గానికి లక్ష ఎకరాలకు సాగునీరందిస్తామని, హల్దీవాగు నుంచి నిజాంసాగర్‌ను నింపుతామన్నారు. దీనిపై సర్వేలు జరుగుతున్నాయని, త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులను ఆదేశించామన్నారు. అనంతరం రూ.19.50 లక్షలతో నిర్మించిన బాల సదనంను



మత్స్యశాఖ బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న పద్మాదేవేందర్‌రెడ్డి, మదన్‌రెడ్డి, మల్లికార్జున్‌గౌడ్

ప్రారంభించారు. అంతకుముందు బాల సదనం ముందు మొక్కలు నాటారు. కొంటూరు చెరువు వద్ద మత్స్యకారులకు అవగాహనాసదస్సు నిర్వహించారు. ముఖ్య అతిథులుగా పద్మారెడ్డి, నర్సాపూర్ ఎమ్మెల్యే మదన్‌రెడ్డి మాట్లాడారు. ఆంధ్రోళ్ల పాలనలో అన్యాయానికి గురైన తెలంగాణ.. పోరాటాల ద్వారా ప్రత్యేక రాష్ట్రాన్ని సాధించుకుందన్నారు. రాష్ట్రంలోని అన్ని వర్గాల సంక్షేమం కోసం ప్రభుత్వం పథకాలు రూపొందిస్తుంటే కాంగ్రెస్ పార్టీ అడ్డంకులు సృష్టిస్తుందని ఆరోపించారు. కాళేశ్వరం ప్రాజెక్టు నుంచి మల్లన్న సాగర్‌కు నీరొస్తే మెదక్‌జిల్లా పచ్చటి పొలాలతో సస్యశ్యామలంగా మారుతుందన్నారు. ఇందుకోసం ప్రభుత్వం వేలకోట్లు ఖర్చుపెట్టి ప్రాజెక్టు నిర్మించేందుకు ముందుకొస్తుంటే కాంగ్రెస్ పార్టీ అక్కసుతో అడ్డుకునే ప్రయత్నం చేస్తుందని ఆరోపిం చారు. ప్రాజెక్టుల నిర్మాణం పూర్త యితే ప్రజలు ఆ పార్టీని ఎక్కడ మర్చిపోతారోనన్న భయంతోనే ప్రాజె క్టుల నిర్మాణం జరగకుండా అడ్డు కునేందుకు కుయు క్తులు పన్నుతున్నారని ఆరోపించారు. ప్రాజెక్టుల నిర్మాణం వల్ల కొంతమందికి నష్టం జరిగినా వంద లాది మందికి ప్రయోజనం కలుగుతుం దన్నారు. అయినా ప్రభుత్వం అన్ని విధాలుగా నష్ట పరిహారం ఇచ్చేందుకు సిద్ధంగా ఉందని పేర్కొన్నారు. అలాగే వర్షాలు లేక సింగూరు నీటివైపు చూడాల్సిన పరిస్థితి మెదక్, నర్సాపూర్ నియోజక వర్గాల ప్రజలకు ఎదురవుతుందన్నారు. త్వరలోనే ప్రాజెక్టు ఎత్తు పెంచే పనులు చేపడితే నీటిసమస్య తీరి, మల్లన్న సాగర్ నీరు కూడా అదుపులోకి వస్తోందని తెలిపారు. రైతులు ప్రాజెక్టుల నిర్మాణం కోసం తమ బాణి వినిపించాలని కోరారు. మత్స్యకారుల సంక్షేమం కోసం వందశాతం సబ్సిడీపై చేప పిల్లలను అందజేస్తున్నట్లు తెలిపారు. ఈసారి కూడా పంచాయతీ పరిధిలో ఉన్న చెరువులకు కూడా చేప పిల్లలను అందిం చేందుకు ఏర్పాట్లు జరిగాయన్నారు. బీసీల సంక్షేమం కోసం వెయ్యికోట్లు మంజూరు చేయడం గొప్పవిషయమన్నారు. కార్యక్రమంలో మత్స్యశాఖ ఏడీ లక్ష్మీ నారాయణ, ఎంపీపీ లక్ష్మి కిష్టయ్య, మున్సిపల్ చైర్మన్ మల్లికార్జున్‌గౌడ్, వైస్ చైర్మన్ రాగిఅశోక్, సర్పంచ్ ఇంతియాజ్, మండల పార్టీ అధ్యక్షుడు అంజాగౌడ్, మత్స్య శాఖ జిల్లా అధ్యక్షుడు నర్సింలు, ఉపాధ్యక్షుడు దుర్గేష్, ఎంపీటీసీ నవనీతశ్రీనివాస్ పాల్గొన్నారు.

సినిమాలు

నర్సాపూర్
సాయి — జయ జానకీనాయక
శ్రీనివాస — నేనేరాజు నేనే మంత్రి

రామాయంపేట
సంతోష్ — నక్షత్రం
సాయిరామ్ — ఫిదా

పెద్దశంకరంపేట
లక్ష్మి — జయ జానకీనాయక

మెదక్
సినీమ్యాక్స్ — ఫిదా
గంగినేని — నేనేరాజు నేనే మంత్రి
సాగర్ — లై

'భగీరథ పనులు' ఆదమరిస్తే ప్రమాదాలు

- **సూచిక బోర్డులు లేకుండా రోడ్డుపక్క తవ్వకాలు**
- **ప్రమాదాలు జరిగితేగాని అధికారులు పట్టించుకోరా**

రేగోడు :మిషన్ భగీరథ పనులు ఇష్టారీతిగా జరుగుతున్నాయి. రోడ్డుపక్కనే పెద్దపెద్ద గుంతలు తీసి సూచిబోర్డులు ఏర్పాటు చేయకపోవడంతో ప్రమాదాలు జరుగుతున్నాయి. పైప్‌లైన్ పనులు జరిగేటప్పుడు ప్రమాదకరంగా ఉందని, సూచించే రిబ్బన్ లేదా, బోర్డులను ఏర్పాటు చేయాల్సినప్పటికీ కాంట్రాక్టర్లు ఏమాత్రం పట్టించుకోవడం లేదు. పనులు పర్యవేక్షణ చేసే అధికారులు అటువైపు తొంగి చూడడం లేదని విమర్శలున్నాయి. రేగోడు మండలంలో మిషన్ భగీరథ పనులు నత్తనడకన సాగుతున్నాయి. పైపుల కోసం గుంతలు తీసి నెలల తరబడి అలాగే వదిలేస్తున్నారు. రేగోడు - జగిర్యాల పైప్‌లైన్ పనులు రోడ్డుపక్కనే తీయడంతో ప్రమాదకరంగా మారింది. ఎదురెదురుగా రెండు వాహనాలు వచ్చిన ప్రమాదాలు జరుగుతున్నాయని ప్రజలు అంటున్నారు. రోడ్డు పక్కనే భగీరథ గుంతలు తీయడంతో ద్విచక్ర వాహనదారులు భయాందోళనకు గురవుతున్నారు. సూచిక బోర్డు, రిబ్బన్ ఏర్పాటుచేసి ప్రమాదం జరుగకుండా ముం దస్తు చర్యలు తీసుకోవాలని అంటున్నారు. ఇటీవలే రేగోడు బసవేశ్వర విగ్రహం వద్ద మిషన్ భగీరథ పైపుకోసం తీసిన గుంతల్లో ట్రాక్టర్, లారీలు ఇరుక్కు పోయిన విషయం విదితమే. మర్పల్లి వద్ద పైపులైన్ కోసం గుంతలు తీసి వదిలేశారు. ప్రమాదాలు జరిగితే గాని అధికారులు పట్టించుకోరా అని ప్రజలు మండి పడుతున్నారు.



ప్రమాదకరంగా ఉన్నమిషన్ భగీరథ పైప్‌లైన్ పనులు



మరుగుదొడ్ల నిర్మాణంపై అవగాహన కల్పిస్తున్న అధికారులు

'ఇంటింటా మరుగుదొడ్డిని నిర్మించుకోవాలి'

అల్లాదుర్గం : పారిశుధ్యం లోపించకుండా ప్రతి కుటుంబం వ్యక్తిగత మరుగుదొడ్లు నిర్మించుకోవాలని ఐకేపీ హెచ్‌డీ సీసీ ఇందిరా, అల్లాదుర్గం పంచాయతీ కార్యదర్శి రాకేష్ కోరారు. మంగళవారం మండలంలోని గొల్ల కుంట గిరిజనతండాలో మరుగుదొడ్ల నిర్మాణాలపై తండావాసులకు అవగాహన కల్పించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పరిసరాలు పరిశుభ్రంగా ఉన్ననాడే ప్రజలు సంపూర్ణ ఆరోగ్యవంతంగా ఉంటారన్నారు.ఈ కార్యక్రమంలో ఆయాపార్టీల నాయకులు నర్సింలు, సూర్యానాయక్, గొమ్యా నాయక్, కేష్యా నాయక్, గోపాల్, సంతోష్ తధితరులు పాల్గొన్నారు.

'ప్రశాంత వాతావరణంలో నవరాత్రోత్సవాలు నిర్వహించుకోవాలి'



శాంతి కమిటీ సమావేశంలో మాట్లాడుతున్న ఏఎస్ఐ బీంలా నాయక్

అల్లాదుర్గం :వినాయక నవరాత్రోత్సవాలను ప్రశాంత వాతావరణంలో కుల, మతాలకు అతీతంగా నిర్వహించుకోవాలని అల్లాదుర్గం పోలీస్ ఏఎస్ఐ బీంలానాయక్ కోరారు. మంగళవారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో శాంతికమిటీ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వినాయక మండపాలవద్ద నిర్వాహకులు విధిగా ఉండి ఎలాంటి అవాంచనీయ సంఘటనలు జరగకుండా చూడాలన్నారు. ఈ సమావేశంలో హెడ్‌కానిస్టేబుల్ ప్రేంకుమార్, సిబ్బంది గంగాధర్, మస్తాన్, కిషన్‌యాదవ్, జనార్దన్, నర్సింలు, టిఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీల అధ్యక్షులు సుభాస్‌రావ్ దేష్‌పాండే, శేషారెడ్డి, ఆయా పార్టీల నాయకులు బల్‌రాం, నర్సింలు, ఆయా గ్రామాలకు చెందిన సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు పాల్గొన్నారు.

ప్రభుత్వ కళాశాల ప్రాంగణంలో శ్రమదానం



పిచ్చిమొక్కలను తొలగిస్తున్న విద్యార్థులు

రామాయంపేట: పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో శ్రమదానం చేపట్టారు. ఎన్ఎస్ఎస్ విద్యార్థులు మంగళవారం కళాశాల ప్రాంగణంలోని పిచ్చిమొక్కలను తొలగించారు. వర్షాకాలంలో ఏపుగా పెరిగిన పిచ్చిమొక్కలతో పాటు చెత్తాచెదారాన్ని తొలగించారు. ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి బాలప్రకాశ్ ఆధ్వర్యంలో విద్యార్థులు ఈ కార్యక్రమాన్ని చేపట్టి కళాశాల ఆవరణలో పరిశుభ్రత పాటించారు.

నేడు టేక్మాల్ ఎంపీపీ సమావేశం

టేక్మాల్: టేక్మాల్ మండలంలో 23న ఎంపీపీ సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీవో విష్ణుకుమార్ తెలిపారు. మండల సమావేశ మందిరంలోని జరిగే సమావేశానికి అధికారులు, ప్రజాప్రతినిధులు హాజరు కావాలన్నారు. ఉదయం 11 గంటలకు జరిగే ఈ సమావేశానికి మండలంలోని ఎంపీటీసీలు, సర్పంచులు హాజరు కావాలన్నారు.

ఆదర్శ గ్రామాల పర్యటనకు తరలిన 'పేట' సర్పంచులు



ఆదర్శ గ్రామాల పర్యటనకు తరలిన పేట సర్పంచులు

పెద్దశంకరంపేట : జిల్లాకలెక్టర్ ఆదేశాల మేరకు వివిధ జిల్లాల్లో ఆదర్శ గ్రామ పంచాయతీలుగా ఎంపికైన గ్రామాల పర్యటనకు పెద్దశంకరంపేట మండలంలోని పలువురు సర్పంచులు మంగళవారం తరలివెళ్లారు. ఈ సందర్భంగా పీఆర్ జిల్లా ట్రెయినింగ్ మేనేజర్ భాగయ్య మాట్లాడుతూ జిల్లాలో 40 మంది సర్పంచులను ఎంపిక చేశామని పేట మండలంలో 7 మందిని ఎంపిక చేసి తీసుకు వెళ్తున్నామన్నారు. మెదక్‌జిల్లాలో మల్కాపూర్, సిద్దిపేటజిల్లాలో ఇబ్రహీంపూర్, నిజామాబాద్ జిల్లా అంకాపూర్ వెళ్లారు. చేగుంటవద్ద ఇబ్రహీంపూర్ గ్రామాలను వాటి అభివృద్ధిని తిలకించడం జరుగుతుందన్నారు. ఆయా ఆదర్శ గ్రామాలలో చెత్త సేకరణ, వర్మికంపోస్టు, జీపీల రెవెన్యూ ఆదాయ వివరాలపై పలు అంశాల గురించి వివరించడం జరుగుతుందన్నారు. పేట మడల సర్పంచులు జంగం శ్రీనివాస్, మధు, రాములు, కాశీరాం, ఏఈ నవీన్, తదితరులు తరలి వెళ్లారు.

'సెప్టెంబర్ 1న పెన్షన్ విద్రోహ దినంగా పాటిస్తాం'

పాపన్నపేట: పెన్షన్ బిక్ష కాదు.. ఉద్యోగ, ఉపాధ్యాయుల హక్కు అని టీపీటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి వడ్ల సంగయ్య పేర్కొన్నారు. సెప్టెంబర్ 1న చలో కలెక్టరేట్‌వద్ద ధర్నాలో భాగంగా పాపన్నపేటలో మంగళవారం పెన్షన్ విద్రోహదిన పోస్టర్‌ను ఆవిష్కరించిన ఉపాధ్యాయసంఘ నేతలు విలేకరులతో మాట్లాడారు. ఉద్యోగ ఉపాధ్యాయులు సెప్టెంబర్ 1న సెలవు పెట్టి అన్ని సంఘాల ఆధ్వర్యంలో తలపెట్టిన ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఉమ్మడిజిల్లాలోని అన్ని కలెక్టరేట్ కార్యాలయాలవద్ద చేపట్టే ధర్నాను విజయవంతం చేయాలని కోరారు. పాతపెన్షన్ విధానాన్ని ప్రభుత్వం పునరుద్దరించే వరకు పోరాటం ఆగదన్నారు. ఈ కార్యక్ర మంలో రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు యాదగిరి, మండల ఉపాధ్యాసంఘం అధ్యక్షుడు బాల్‌రాజ్, జిల్లా నాయకులు బాగన్న, సర్దార్‌హుస్సేన్, ఫసియొద్దీన్, వీరేషం, మల్లప్ప, వీర్‌కుమార్ పాల్గొన్నారు.

'మొక్కలను సంరక్షించుకోవాలి'

పెద్దశంకరంపేట : హరిత హారంలో భాగంగా నాటిన ప్రతి మొక్కను సంరక్షించుకోవాలని పేట ఎంపీపీ సంగమేశ్వర్ అన్నారు. మంగళవారం పెద్దశంకరంపేట ఎంపీడీవో కార్యాలయం ఎదుట మొక్కలను నాటారు. ఈ కార్యక్రమంలో పేట సర్పంచ్ జంగం శ్రీనివాస్, ఎంపీటీసీ సుభాష్‌గౌడ్, మండల టీఆర్ఎస్ అధ్యక్షుడు విజయరామరాజు, ఎంపీడీవో హరిసింగ్, ఏపీవో మహిపాల్‌రెడ్డి, ఈవో నవీన్ తదితరులున్నారు.



మొక్కను నాటుతున్న ఎంపీపీ సంగమేశ్వర్

ఘనంగా ఫ్రెషర్స్‌డే వేడుకలు

పెద్దశంకరంపేట:మండలకేంద్రమైన పెద్దశంకరంపేటలోని ఆదర్శపాఠశాలలో ఇంటర్మీడియట్ విద్యార్థులు మంగళవారం ఘనంగా ఫ్రెషర్స్‌డే వేడుకలు జరుపుకున్నారు. ప్రిన్సిపాల్ విఠల్ నాయక్ మాట్లాడుతూ విద్యార్థి జీవితం ఎంతో విలువైందన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.



కార్యక్రమంలో మాట్లాడుతున్న ఆదర్శ పాఠశాల ప్రిన్సిపాల్ విఠల్‌నాయక్

మరుగుదొడ్లు నిర్మించుకున్నవారికి బిల్లులు అందజేత

పెద్దశంకరంపేట:ఐఎస్‌హెచ్ పథకం ద్వారా పెద్దశంకరంపేట మండల పరిధిలోని టెంకటిలో మరుగుదొడ్లు నిర్మించుకున్నవారికి మండల సర్పంచుల ఫోరం మాజీ అధ్యక్షుడు కోనం విఠల్, పంచాయతీ కార్యదర్శి ప్రభాకర్ మంగళవారం బిల్లులను పంపిణీ చేశారు. మరుగుదొడ్లు నిర్మించుకున్న 15 మంది లబ్ధిదారులకు 6 వేల రూపాయల చొప్పున నగదును అందజేశారు. గ్రామంలో ప్రతి ఇంటికీ మరుగుదొడ్లు తప్పనిసరిగా నిర్మించుకోవాలన్నారు. ఆయన వెంట వార్డు సభ్యులు సంగమేశ్వర్ ఉన్నారు.



టెంకటిలో మరుగుదొడ్ల బిల్లును అందిస్తున్న దృశ్యం

వర్షానికి కూలిన ఇల్లు

హవేళీఘణాపూర్: మండల కేంద్రమైన హవేళీఘణపూర్‌లో ఎక్కల్‌దేవి ఓంకార్ ఇల్లు గత మూడురోజులుగా కురుస్తున్న వర్షానికి మంగళవారం ఉదయం కూలిపోయిందని తెలిపారు. కూలి పోయిన ఇంటికి మరమ్మతులు చేయించుకోవడానికి ప్రభుత్వం ఆర్థిక సాయం అందించాలని బాధితుడు కోరాడు.

మిషన్ భగీరథ ద్వారా 21 తాగునీటి ట్యాంకులు

- యాభై కిలోమీటర్ల పైప్‌లైన్ మంజూరు
- వినియోగంలోకి రానున్న మంజీర నీటి ట్యాంకులు
- ఎమ్మెల్యేచే పనుల ప్రారంభోత్సవానికి సిద్ధమవుతున్న అధికారులు

అల్లాదుర్గం: తాగునీటిసమస్య శాశ్వత పరిష్కారం కోసం ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన మిషన్ భగీరథ పథకం ద్వారా అల్లాదుర్గం మండలానికి 21 నీటి ట్యాంకులు మంజూరైనట్లు అధికారవర్గాల ద్వారా తెలిసింది. మండలంలోని 13 గ్రామ పంచాయతీలకుగాను గడిపెద్దాపూర్ గ్రామానికి రెండు నీటి ట్యాంకులు మంజూరుకాగా ఇతర గ్రామ పంచాయతీలతో పాటు మధిర గ్రామాలకు ఒక్కొక్కట్యాంకు చొప్పున మంజూ రయ్యాయి. అయితే గత కాంగ్రెస్ ప్రభుత్వంలో మండలంలోని ఆయా గ్రామాల్లో మంజీర జలాల కోసం నిర్మించిన ట్యాంకు లను ఈ పథకం కోసం అధికారులు వినియోగంలోకి తేనున్నారు. మండల కేంద్రమైన అల్లాదుర్గం పట్టణంలోని కాన్షీరాం నగర్, ఐబీ గిరిజన తండాలతో పాటు స్థానికంగా నిర్మింపచేసిన మంజీరా ట్యాంకులతోపాటు నూతనంగా మంజూరైన మరో ట్యాంక్‌ను నిర్మింపచేసి మూడు ట్యాంకులతో స్థానిక ప్రజల దాహార్తిని తీర్చేందుకు అధికారులు చర్యలు చేపట్టినట్లు తెలిసింది. కాగా మండలంలోని ఆయా గ్రామాల ప్రజల దాహార్తిని తీర్చేందుకుగాను యాభై కిలోమీటర్ల పైప్‌లైన్ నిర్మాణం జరుగనుందని, వీటి పనుల ప్రారంభోత్సవానికి స్థానిక ఎమ్మెల్యే పి.బాబుమోహన్‌చే ప్రారంబింపచేసేందుకు అధికారులు సమాయత్తం చేసినట్లు తెలిసింది.

ఎంతో కాలంగా తాగునీటి కోసం అల్లాడుతున్న ప్రజానీకానికి రానున్న వేసవిలో ఈ నీటికష్టాలు తొలగించేందుకు అధికారులు ముమ్మర చర్యలు చేపట్టారు.



గడిపెద్దాపూర్‌లో నిర్మించిన మంజీరా ట్యాంక్



అర్ధనగ్నంగా నిరసన తెలుపుతున్న ఉద్యోగులు

తపాలా ఉద్యోగుల అర్ధనగ్న నిరసన

నిజాంపేట: ఆలిండియా గ్రామీణ సేవక్ యూనియన్ ఆధ్వర్యంలో కొన్నిరోజుల నుంచి పోస్టాఫీస్‌లో నిర్వహిస్తున్న సమ్మెలో భాగంగా మంగళవారం నిజాంపేట మండలకేంద్రంలో తపాలా ఉద్యోగులు అర్ధనగ్న ప్రదర్శన నిర్వహించి తమ నిరసన తెలిపారు. ఏడురోజుల నుంచి నిరవధికంగా సమ్మెను నిర్వహిస్తున్నామని తెలిపారు. కార్మికులకు 8 గంటల పని నిర్ణయించి కమలేష్, చంద్రకమిటీ సిఫారసులు వెంటనే అమలు చేయాలని 22మంది తపాలా ఉద్యోగులు తెలిపారు. ఈ కార్యక్రమంలో అధ్యక్షుడు శ్రీనివాస్‌గౌడ్, ఉపాధ్యక్షులు లత, కృష్ణ, శ్రీనివాస్, చంద్రం, నిఖిల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు బస్సు సౌకర్యం కల్పించండి

- ఎస్‌ఎఫ్‌ఐ ఆధ్వర్యంలో పాదయాత్ర



వినతి పత్రం సమర్పిస్తున్న నాయకులు

నిజాంపేట: విద్యార్థులకు బస్సుసౌకర్యం కల్పించి వారి బంగారు భవిష్యత్తుకు ప్రభుత్వం తోడ్పడాలని ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా ఉపాధ్యక్షుడు బాబు తెలిపారు. నిజాంపేట మండలంలోని నార్లపూర్ గ్రామం నుంచి నిజాంపేట తహసీల్దార్ కార్యాలయం వరకు పాదయాత్ర నిర్వహించారు. బస్సు సౌకర్యం లేక కాలినడకగా విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారని ఆయన తెలిపారు. ఆయన వెంట కల్వకుంట, నార్లపూర్, వెంకటాపూర్ గ్రామానికి చెందిన విద్యార్థినీ విద్యార్థులు స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో వినతి పత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షురాలు బాలమణి, ఎస్‌ఎఫ్‌ఐ మండల కార్యదర్శి జగన్, నాయకులు రాకేశ్, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

'హిందూ పండుగలు ప్రభుత్వానికి కానరావా..?'



సమావేశంలో మాట్లాడుతున్న బీజేపీ నాయకులు

నిజాంపేట: బంగారు తెలంగాణలో భాగంగా అందరూ సమానమన్న తెలంగాణ ప్రభుత్వం ప్రజల పాలన విషయంలో హిట్లర్ పాలనని తలపిస్తోందని బీజేపీ మండల అధ్యక్షుడు శ్రీనివాస్‌గౌడ్ ఆరోపించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలందరూ సమానమైనప్పుడు పండుగలు కూడా సమానంగా నిర్వహించాలన్నారు. ఇటీవల తెలంగాణ ప్రభుత్వం వినాయక చవితి మండపాలకు కరెంటుబిల్లు కట్టమనడం హాస్యాస్పదమన్నారు. అలాగే ఎటువంటి ఆంక్షలు లేకుండా పండుగను నిర్వహించుకునేలా చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు ఆకుల రమేశ్, చంద్రశేఖర్ పాల్గొన్నారు.

ఎన్నికల హామీలను అమలు చేయాలని కోరుతూ

కేంద్రప్రభుత్వ దిష్టిబొమ్మ దహనం

మెదక్ రూరల్: కేంద్రప్రభుత్వం ఎన్నికల హామీని విస్మరిస్తోందని ఆరోపిస్తూ మంగళవారం సీపీఎం ఆధ్వర్యంలో మెదక్ పట్టణంలో కేంద్రప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేశారు. అనంతరం సీపీఎం జిల్లా కార్యదర్శి మల్లేశం మాట్లాడుతూ ప్రభుత్వ ప్రజావ్యతిరేక పాలనను నిరసిస్తూ దేశవ్యాప్తంగా సీపీఎం నిరసన కార్యక్రమాలు చేపట్టిందన్నారు. అప్పులబాధతో బాదపడుతున్న రైతులందరికీ వెంటనే రుణమాఫీ చేయాలని, ఉత్పత్తి ధరకన్నా ఒకటిన్నర రెట్ల కనీస మద్దతు ధర ప్రకటిస్తామన్న బీజేపీ ఎన్నికల వాగ్దానాన్ని తక్షణమే అమలుచేయాలని డిమాండ్ చేశారు. ప్రకటించిన ఎంఎస్‌పీ ధరకే తమ ఉత్పత్తులను అమ్ముకోవడానికి హక్కు కల్పించేలా కేంద్రం చట్టం తీసుకురావాలని కోరారు. ఏటా రెండు కోట్ల ఉద్యోగాలిస్తామన్న వాగ్దానాన్ని అమలుచేయడంతో పాటు పబ్లిక్‌రంగ, పబ్లిక్ సర్వీస్‌ల ప్రైవేటీకరణను ఆపాలని కోరారు. జీఎస్టీ వల్ల వివిధ వర్గాలు, ప్రజలపై మోపబడుతున్న పెనుభారాలను ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బాలమణి, రాజు, జిల్లా కార్యదర్శి లచ్చాగౌడ్, ఎన్‌పీఆర్డీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

రైతు సేవకు 'హెరిటేజ్'

మేనేజర్ నర్సింగరావు

చిన్నశంకరంపేట: రైతు సేవకై హెరిటేజ్ సంస్థ అని ఆ సంస్థ మేనేజర్ నర్సింగరావు అన్నారు. మంగళవారం గవ్వలపల్లి గ్రామంలో రైతు ఎల్లవ్వకు రూ. 2 లక్షల బీమా చెక్కును హెరిటేజ్ ప్రతినిధులు అందించారు. ఆ గ్రామానికి చెందిన పాడిరైతు రెడ్డి మల్లేష్ విద్యుదాఘాతంతో మృతి చెందాడు. మృతుడి కుటుంబీకులకు బీమా చెక్కును అందించిన సందర్భంగా ఆయన మాట్లాడుతూ వ్యవసాయంతోపాటు పాడిపరిశ్రమపై రైతులు మొగ్గు చూపాలన్నారు. హెరిటేజ్ సంస్థ రైతులకు బీమా సౌకర్యం కల్పిస్తుందన్నారు. రైతు శ్రేయస్సుకు సంస్థ వెన్నంటి ఉందన్నారు. ప్రతీ రైతు బీమా చేసుకోవడం మంచిదన్నారు. ఈ కార్యక్రమంలో టీఆర్‌ఎస్ మండల శాఖ అధ్యక్షుడు పట్లోరి రాజు, ఏరియా మేనేజర్ వెంకటేశం, అబ్దుల్లా ఖాన్, యూనిట్ ఏజెంట్ ప్రతాప్ తదితరులు పాల్గొన్నారు.



రైతు ఎల్లవ్వకు బీమా చెక్కును అందిస్తున్న హెరిటేజ్ ప్రతినిధులు

సేంద్రియ పద్ధతుల ద్వారా అధిక లాభాలు

- మండల వ్యవసాయాధికారి నాగమాధురి



జీవామృతం తయారీని వివరిస్తున్న వ్యవసాయ అధికారి నాగమాధురి

హవేళీఘణాపూర్: వ్యవసాయంలో సేంద్రియ పద్దతులు పాటించడం ద్వారా అధిక లాభాలను పొందవచ్చని మండల వ్యవసాయ అధికారి నాగమాధురి తెలిపారు. మంగళవారం మండల కేంద్రంలోని రైతు నరేందర్‌రెడ్డి వ్యవసాయక్షేత్రంలో జీవామృతం తయారుచేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రైతులు కృత్రిమ ఎరువులను వాడి పెట్టుబడి ఖర్చులు పెంచుకుంటున్నారన్నారు. పెట్టుబడి తగ్గాలంటే సేంద్రియ వ్యవసాయం ద్వారానా సాధ్యమౌతుందన్నారు. ఈ విధానం ద్వారా దిగుబడి కూడా అధికంగా వస్తుందన్నారు. పొలంలో జీవామృతం వేయడం ద్వారా భూమిలో సూక్ష్మజీవులు పెంపొంది నేల ఆరోగ్యవంతమౌతుందన్నారు. ఎటువంటి కృత్రిమ ఎరువులు వాడకుండా ఎక్కువ దిగుబడి సాదించవచ్చని రైతులకు సూచించారు. ఈ జీవామృతం తయారీలో ఏఈవో శోభారాణి, రైతులు నరేందర్‌రెడ్డి, లక్ష్మయ్య, లక్ష్మీనారాయణ, సత్యాగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

రాజిపేట పాఠశాలలో తట్టు, రుబెల్లా టీకాలు



టీకాలు వేస్తున్న ఏఎన్‌ఎం కవిత

హవేళీఘణాపూర్: మంగళవారం మండల పరిధి లోని రాజిపేట ఉన్నతపాఠశాలలో తట్టు, రుబెల్లా టీకాలను ఏఎన్‌ఎం కవిత, అనితలు విద్యార్థులకు వేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తట్టు, రూబెల్లా టీకాలు వేయడంవల్ల ఎటువంటి రోగాలు రాకుండా ఉంటాయని, ప్రతీవిద్యార్థి తప్పనిసరిగా టీకాలు వేయించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అంగన్ వాడీ కార్యకర్తలు, ఉపాధ్యాయులు బాలకిషన్, అశోక్, భాస్కర్‌రెడ్డి, సంతోష్‌కుమార్, రాంచందర్, బషీరొద్దిన్, దత్తాత్రితో పాటు విద్యార్థులు పాల్గొన్నారు.

టేక్మాల్‌లో

టేక్మాల్: ప్రాణంతాకమైన తట్టు రుబెల్లా వ్యాధిని నిర్మూలించేందుకు 15ఏళ్లలోపు చిన్నరులకు టీకాలు వేస్తున్నట్లు వైద్యఆరోగ్యశాఖ సూపర్‌వైజర్ వసంత తెలిపారు. మండలంలోని అచ్చన్నపల్లి, హసన్‌మహ్మద్‌పల్లి, ఎలకుర్తి, చల్లపల్లి, తదిరత గ్రామాల్లోని పాఠశాలల్లో విద్యార్థులకు టీకాలు వేయడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో వైద్యఆరోగ్యశాఖ సిబ్బంది అనసూయ, జయప్రద, మోయిస్, స్వప్న తదితరులు పాల్గొన్నారు.



గ్రామసభలో మాట్లాడుతున్న ఎంపీడీవో కౌసల్యాదేవి

వందశాతం మరుగుదొడ్లు నిర్మించుకోవాలి

● ఎంపీడీవో కౌసల్యాదేవి

శివ్వంపేట: ప్రతి ఒక్కరూ మరుగుదొడ్లు నిర్మించుకోవాలని ఎంపీడీవో కౌసల్యాదేవి అన్నారు. మండలంలోని రత్నాపూర్‌లో మంగళవారం గ్రామసభలో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ మరుగుదొడ్లు నిర్మించుకొని వందశాతం పూర్తయ్యే విధంగా కృషి చేయాలన్నారు. రత్నాపూర్ గ్రామంలో 170 మంది మరుగుదొడ్లు లేని వారిని గుర్తించామని, పంచాయతీ కార్యదర్శి, ఫీల్డ్ అసిస్టెంట్, ఏపీఎంకు దత్తతగా ఇచ్చామన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ శంకర్, పంచాయతీ కార్యదర్శి సాయిప్రసాద్, ఎన్ఆర్‌జీఎస్ ఇన్‌చార్జి ఏపీఎం శ్రీనివాస్ తదితరులున్నారు.

'వైద్యులు ప్రజలకు అందుబాటులో ఉండాలి'



పీహెచ్‌సీలో రికార్డులను పరిశీలిస్తున్న రమేశ్

శివ్వంపేట: మండల కేంద్రమైన శివ్వంపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని డిప్యూటీ డీఎంఅండ్‌హెచ్‌వో రమేశ్ మంగళవారం సందర్శించి రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైద్య సిబ్బంది సమయపాలన పాటించి ప్రజలకు అందుబాటులో ఉండి మెరుగైన వైద్యం అందించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ స్వర్ణలత, సిబ్బంది ఉన్నారు.

అంత్యక్రియలకు మాజీ మంత్రి హాజరు

శివ్వంపేట: మండలంలోని చిన్నగొట్టిముక్క గ్రామంలో కాంగ్రెస్ సీనియర్ నాయకుడు ముత్యాలరావు(70) అనారోగ్యంతో సోమవారం రాత్రి మృతి చెందాడు. విషయం తెలుసుకున్న మాజీ మంత్రి సునీతారెడ్డి ముత్యాలరావు కుటుంబీకులను పరామర్శించి, అంత్యక్రియల్లో పాల్గొన్నారు. ఆమె వెంట నాయకులు నర్సింగ్‌రావు, మహేందర్‌రెడ్డి, హరిశంకర్‌గౌడ్, ఆంజనేయులు, పెంటయ్యగుప్తా, శంకర్ తదితరులున్నారు.

జానపద కళాకారుల భారీ ర్యాలీ

● ఆకట్టుకున్న కళారూపాలు

● సంఘీభావంగా తెలిపిన కాంగ్రెస్, బీఎస్పీ

హత్నూర: ప్రపంచ జానపద దినోత్సవం సందర్భంగా హత్నూర మండల పరిధిలోని దౌల్తాబాద్‌లో కళాకారులు భారీ ర్యాలీ నిర్వహించారు. జిల్లాలోని ఆయా ప్రాంతాల నుంచి వచ్చిన కళాకారులు ఈ ర్యాలీలో పాల్గొని తమ కళారూపాలను ప్రదర్శించారు. దౌల్తాబాద్ బస్టాండు నుంచి అంబేద్కర్ చౌరస్తా వరకు దారి పొడవునా పలు నినాదాలు చేశారు. అనంతరం అంబేద్కర్, తెలంగాణ తల్లి విగ్రహాలకు పూలమాలలు వేశారు. కాగా కళాకారుల ర్యాలీకి ఎంపీపీ మాజీ ఉపాధ్యక్షుడు కొన్యాల వెంకటేశం, బీఎస్పీ నర్సాపూర్ నియోజకవర్గ ఇన్‌చార్జి శాంతకుమార్ సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా జానపద కళాకారుల సంఘం జిల్లా అధ్యక్షుడు వీఎం.ఎల్లయ్య మాట్లాడుతూ జానపద కళలను ప్రోత్సహిస్తూ కళాకారులను ప్రభుత్వం అన్ని విధాలుగా ఆదుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో హత్నూర మండల శాఖ అధ్యక్షుడు పి.కృష్ణ, సంఘం బాధ్యులు యాదమ్మ, లక్ష్మి, కుమార్, హైమద్, మల్లేశం, మహేశ్, వేణుగోపాల్, అనురాధ, దుర్గయ్య, యాదగిరిగౌడ్, రవి, సుష్మిత, సువర్ణ, లక్ష్మణ్, జ్ఞానానంద్ తదితరులు పాల్గొన్నారు.

డీఎస్పీ కార్యాలయానికి స్థల పరిశీలన

● నర్సాపూర్‌లో స్థల పరిశీలన చేసిన తూప్రాన్ డీఎస్పీ

నర్సాపూర్: డివిజన్ కేంద్రమైన నర్సాపూర్‌లో కొత్తగా ఏర్పాటు కానున్న పోలీస్ సబ్‌డివిజన్ కార్యాలయం కోసం మంగళవారం తూప్రాన్ డీఎస్పీ భాస్కర్ స్థల పరిశీలన నిర్వహించారు. నూతనంగా నర్సాపూర్ రెవెన్యూ డివిజన్‌గా ఏర్పడిన తర్వాత పోలీస్ సబ్‌డివిజన్ ఏర్పాటు చేయాలని స్థానిక ఎమ్మెల్యే మదన్‌రెడ్డి సీఎం కేసీఆర్‌కు విన్నవించారు. మొదట్లో కౌడిపల్లిలో ఏర్పాటు చేయాలని నిర్ణయించుకున్నా, ఈ విషయమై తీవ్రమైన వ్యతిరేకత రావడంతో నర్సాపూర్‌లో ఏర్పాటు చేయాలని ఎమ్మెల్యే మదన్‌రెడ్డి సీఎం కేసీఆర్‌కు మరో లేఖ ఇచ్చారు. ఈ మేరకు ఉన్నతాధికారుల ఆదేశాలతో పోలీస్ డివిజన్ కార్యాలయం ఏర్పాటు సాధ్యాసాధ్యాలను తెలుసుకోవడంతో పాటు కార్యాలయం కోసం స్థల పరిశీలన నిమిత్తం తూప్రాన్ డీఎస్పీ మంగళవారం నర్సాపూర్‌లో పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సబ్ డివిజన్ కార్యాలయం కోసం రెండు ఎకరాల స్థలం కేటాయించాలని రెవెన్యూ అధికారులకు సూచించినట్లు తెలిపారు. స్థలం లభించే వరకు తాత్కాలికంగా అద్దె భవనం కోసం కూడా పరిశీలిస్తున్నట్లు ఆయన తెలిపారు. త్వరలోనే కార్యాలయంపై పూర్తి సమాచారం తెలియజేస్తామన్నారు.

పోలీస్ సబ్ డివిజన్ కార్యాలయం ఎట్టకేలకు నర్సాపూర్‌లోనే ఏర్పాటు చేయడానికి కసరత్తు చేస్తుండటంతో స్థానిక ప్రజలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.



స్థలాల మ్యాప్‌ను పరిశీలిస్తున్న డీఎస్పీ భాస్కర్

బయోగ్యాస్ ప్లాంటు నిర్మాణం ప్రారంభం

కౌడిపల్లి: ఉన్నత భారత్ అభియాన్‌లో ఎంపిక చేసిన ఐదు గ్రామాల్లో బయో గ్యాస్ ప్లాంట్ల నిర్మాణ పనులను ముమ్మరం చేస్తున్నట్లు ఎంపీపీ అధ్యక్షురాలు చిలుముల పద్మానర్సింహారెడ్డి పేర్కొన్నారు. మంగళవారం మండలంలోని భుజరంపేట్ గ్రామంలో బయోగ్యాస్ ప్లాంటు, వర్మికంపోస్టు పనులకు శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ ఉన్నత భారత్ అభియాన్ క్రింద ఎంపికైన భుజరంపేట్, మహ్మద్‌నగర్, కన్నారం, సలావత్‌పూర్, అంతారం తదితర గ్రామాల్లో వందశాతం మరుగుదొడ్లు నిర్మించుకోవాలన్నారు. మురుగు కాల్వలు లేకుండా ఎక్కడికక్కడ ఇంకుడు గుంతలు నిర్మించడం జరుగుతుందన్నారు. అదేవిధగా పాడి గేదెల పేడతో బయోగ్యాస్ తయారీ, వర్మికం పోస్టు ఎరువుల తయారీ వంటి పనులపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో సత్యనారాయణ, కార్యదర్శి నరేశ్, ఏపీవో అంజిరెడ్డి, ఉపసర్పంచ్ మధుసూదన్‌రెడ్డి, నాయకులు నాయికోటి లింగం తదితరులు ఉన్నారు.



భుజరంపేట్‌లో ప్లాంటు పనులు ప్రారంభిస్తున్న ఎంపీపీ పద్మానర్సింహారెడ్డి

చండూర్‌లో హరితహారం



మొక్కను నాటుతున్న తహసీల్దార్ సాదత్

చిలప్‌చెడ్: మండలంలోని చండూర్ గ్రామంలో తహసీల్దార్ సాదత్ ఆధ్వర్యంలో హరితహారంలో భాగంగా మంగళవారం మొక్కలను నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హరితహారంలో ప్రతి గ్రామానికి 40వేల మొక్కల చొప్పున నాటాలన్నారు. చండూర్‌లో ఇప్పటి వరకు ఏడు వేల మొక్కలను నాటామని, ప్రతి ఒక్కరూ మొక్కలను నాటి వాటిని సంరక్షించే బాధ్యత తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ లక్ష్మీరాజు, మండలాధ్యక్షుడు నరేందర్‌రెడ్డి, తదితరులున్నారు.

బస్సుల కోసం రోడ్డెక్కిన విద్యార్థులు

చిలప్‌చెడ్: మండలంలోని సీలాంపల్లి గేటు వద్ద బస్సుల కోసం సోమక్కపేట గ్రామానికి చెందిన విద్యార్థులు మంగళవారం రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జోగిపేట నుంచి కౌడిపల్లి వరకు బస్సు సౌకర్యం ఉండేదని, ఈ విద్యా సంవత్సరం నుంచి బస్సు రాకపోవడంతో తీవ్రమైన ఇబ్బందులను ఎదుర్కోవలసి వస్తోందన్నారు. నర్సాపూర్ నుంచి జోగిపేటకు వచ్చే బస్సులు కూడా సమయానికి రాకపోవడంతో ఇబ్బందులు పడుతున్నామన్నారు. దీంతో తాము ప్రతి రోజు ఉదయం, సాయంత్రం ఎనిమిది కిలో మీటర్లు నడవాల్సి వస్తోందన్నారు. ఆర్టీసీ అధికారులు తమ బాధను గుర్తించి బస్సు సౌకర్యాన్ని పునరుద్ధరించాలని కోరారు. అనంతరం పోలీసు సిబ్బంది చొరవతో ఆందోళన విరమించారు.



సీలాంపల్లి గేటు వద్ద బస్సుల కోసం రాస్తారోకో చేస్తున్న విద్యార్థులు

'రుబెల్లా టీకాలు తప్పనిసరిగా వేయించాలి'

నర్సాపూర్‌రూరల్: తొమ్మిది నెలల నుంచి 15 సంవత్సరాల పిల్లలకు రుబెల్లా టీకాలు వేయించాలని రెడ్డిపల్లి పీహెచ్‌సీ డాక్టర్ జ్యోతి అన్నారు. మంగళవారం మండలంలోని రెడ్డిపల్లి జిల్లా పరిషత్ పాఠశాలలో విద్యార్థులకు రుబెల్లా టీకాలు వేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ 9 నెలల నుంచి 15సంవత్సరాల పిల్లలకు తప్పకుండా రుబెల్లా టీకాలు వేయించాలని ఆమె సూచించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ భరత్‌గౌడ్, హెచ్ఎం షఫియోద్దీన్, ఉపాధ్యాయులు సత్యనారాయణ రాజు, నాయకుడు రవీందర్‌గౌడ్ ఉన్నారు.

తుజాల్‌పూర్‌లో

మండలంలోని తుజాల్‌పూర్ గ్రామంలో ప్రాథమికోన్నత పాఠశాల విద్యార్థులకు రుబెల్లా టీకాలు వేశారు. ఈ కార్యక్రమంలో ఏఎన్ఎంలు, ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.

చిలప్‌చెడ్‌లో

చిలప్‌చెడ్: మండలంలోని చిలప్‌చెడ్, సీలాంపల్లి, రహీంగూడలో మంగళవారం రుబెల్లా టీకాలు వేసినట్లు హెల్త్ సూపర్‌వైజర్ మార్తా తెలిపారు. ఆయా కార్యక్రమాల్లో పాల్గొన్న సందర్భంగా ఆమె మాట్లాడుతూ చిలప్‌చెడ్‌లో 217 మంది, సీలాంపల్లిలో 51మంది, రహీంగూడలో 70మందికి టీకాలు వేసినట్లు తెలిపారు. చిన్నారులకు తప్పిని సరిగా టీకాలు వేయించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ సాదత్, ఎంపీటీసీ లలితధర్మారెడ్డి, ప్రధానోపాధ్యాయుడు విఠల్, డాక్టర్ దయానంద్ పాల్గొన్నారు.

'సీపీఎస్ విధానాన్ని రద్దు చేయాలి'

శివ్వంపేట: సీపీఎస్ విధానాన్ని రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని టీఎస్‌యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్‌రావు, ఉపాధ్యక్షుడు సుదర్శన్ అన్నారు. మంగళవారం శివ్వంపేటలో వారు విలేకరులతో మాట్లాడుతూ సీపీఎస్ విధానాన్ని రద్దు చేయాలని ఉపాధ్యాయ సంఘాల పోరాట సమితి ఆధ్వర్యంలో సెప్టెంబరు 1న విద్రోహ దినంగా పాటించాలని, ఉపాధ్యాయులు పెద్ద సంఖ్యలో నిరసన ప్రదర్శనలో పాల్గొనాలని కోరారు. ఈ కార్యక్రమంలో టీఎస్‌యూటీఎఫ్ నాయకులు శివశంకర్, మనీష్‌రెడ్డి, దుర్గాప్రసాద్ తదితరులున్నారు.

పెన్షన్ విద్రోహ దినం వాల్‌పోస్టర్ ఆవిష్కరణ

చిలప్‌చెడ్: మండల కేంద్రమైన చిలప్‌చెడ్ ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయ సంఘాల పోరాట సమితి ఆధ్వర్యంలో సెప్టెంబరు 1న పెన్షన్ విద్రోహ దినంగా పాటించాలని కోరుతూ మంగళవారం వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయ సంఘాల నాయకులు మాట్లాడుతూ 1సెప్టెంబరు 2004లో ప్రవేశపెట్టిన నూతన పెన్షన్ విధానం సీపీఎస్ ఉద్యోగ, ఉపాధ్యాయుల పాలిట శాపంగా మారిందని, దీన్ని రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని కోరుతూ సెప్టెంబరు 1న నల్లబ్యాడ్జీలు ధరించి ధర్నాలో పాల్గొనాలని అన్నారు.




మురుగును తీస్తున్న పంచాయతీ సభ్యుడు ధన్‌రాజ్

పంచాయతీ పంట్టించుకోవడం లేదని...

● సఫాయి అవతారమెత్తిన వార్డు సభ్యుడు

తూప్రాన్: మీరు చూస్తున్నదీ నిజమే. ఆయన తూప్రాన్ మేజర్ పంచాయతీ సభ్యుడు పోతరాజ్ ధన్‌రాజ్. ఆయనే సఫాయి అవతారమెత్తాడు. ఉదయమే పార పట్టుకొని మురుగు కాలువను శుభ్రం చేయడంలో నిమగ్నమయ్యాడు. వివరాల్లోకి వెళితే.. తూప్రాన్ పట్టణంలోని ఒకటో వార్డులో పుట్టకోట నుంచి బెస్తవాడ వరకు కొద్దిరోజులుగా మురుగు కాలువలను శుభ్రం చేయడం లేదు. ఈ విషయాన్ని కాలనీ వాసులు పంచాయతీ కార్యాలయంలో ఫిర్యాదు చేశారు. ఫలితం లేకపోయిందీ, పంచాయతీ సభ్యుడి దృష్టికి తీసుకొచ్చారు. దీంతో కాలనీవాసుల ఇబ్బందులను గ్రహించిన సభ్యుడు ధన్‌రాజ్ తానే సఫాయిగా మారిపోయాడు. పారపట్టుకొని మురుగును తొలగించారు. ధన్‌రాజ్ చేస్తున్న పనిని పలువురు శభాష్ ధన్‌రాజ్ అంటున్నారు.

ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో తనిఖీలు


చేగుంట ఆస్పత్రిలో డాక్టర్‌తో మాట్లాడుతున్న చక్రధర్

చేగుంట: మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్యకేంద్రాన్ని అదనపు జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ చక్రధర్ మంగళవారం ఆకస్మికంగా సందర్శించారు. ఆస్పత్రిలో రోగులకు అందుతున్న సేవలను అడిగి తెలుసుకున్నారు. సూచించారు. ఆస్పత్రిలో వైద్యానికి వచ్చిన రోగులను స్వయంగా పరిశీలించి వారికి మందులను రాసారు. ఆస్పత్రిలో జరుగుతున్న కాన్పులపై ఆరాతీశారు. లేబర్‌రూం ఎలా ఉంది, గర్భిణులకు ఏయే మందులు అందజేస్తున్నారు.. కేసీఆర్ కిట్లు ఎంతమందికి ఇచ్చారని అడిగి తెలుసుకున్నారు. ఆస్పత్రి సిబ్బంది సమయపాలన పాటించి రోగులకు సేవలు అందించాలని సూచించారు.

25 నుంచి నిరుద్యోగులకు శిక్షణ


సమావేశంలో మాట్లాడుతున్న కిషన్

వెల్దుర్తి: నిరుద్యోగులకు ఈ నెల 25 నుంచి సంగారెడ్డి, మెదక్ జిల్లా కేంద్రాల్లో శిక్షణ శిబిరాలను నిర్వహిస్తున్నట్లు మండల ఐకేపీ ఏపీఎం కిషన్ తెలిపారు. మంగళవారం వెల్దుర్తి ఐకేపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. 90 రోజుల పాటు ఈ శిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు. 18నుంచి 26 సంవత్సరాల యువతీ, యువకులకు ఈ శిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు. యువకులకు మెదక్‌లోని శిశుమందిర్ పక్కనున్న ఐకేపీ కార్యాలయంలో భోజన వసతి, రెసిడెన్షియల్ సౌకర్యం కల్పిస్తున్నట్లు తెలిపారు. యువతులకు సంగారెడ్డి జిల్లా కేంద్రంలో 90 రోజుల శిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు. శిక్షణ అనంతరం ప్రైవేటు సెక్టార్లలో ఉద్యోగ అవకాశాలు కల్పిస్తామన్నారు. వీరికి వేతనం రూ.7వేల నుంచి రూ.10వేల వరకు ఉంటుందని చెప్పారు.

'విద్యార్థులకు ఎంఆర్ టీకాలు వేయించాలి'



మల్కాపూర్ పాఠశాలలో విద్యార్థులకు టీకాలు వేస్తున్న వైద్య సిబ్బంది, వడియారం పాఠశాలలో టీకాలను పరిశీలిస్తున్న డాక్టర్ చక్రధర్

తూప్రాన్‌రూరల్: మండలంలోని మల్కాపూర్ పాఠశాలలో మంగళవారం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్య సిబ్బంది 15 యేళ్ల లోపు వయసున్న బాలబాలికలకు రుబెల్లా టీకాలు వేశారు. తల్లి దండ్రులు వచ్చి తమ పిల్లలకు దగ్గరుండి ఆసక్తిగా టీకాలు వేయించారు. పెద్ద సంఖ్యలో వైద్య సిబ్బంది ఉదయం నుంచి సాయంత్రం వరకు టీకాలు వేశారు.

చేగుంటలో

చేగుంట: తట్టువ్యాధి నివారణ కోసం విద్యార్థులు తప్పనిసరిగా ఎంఆర్ టీకాలను వేయించుకోవాలని జిల్లా అదనపు వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ చక్రధర్ సూచించారు. మండలంలోని వడియారం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మంగళవారం నిర్వహించిన టీకాల కార్యక్రమాన్ని పర్యవేక్షించారు. ఈసందర్భంగా తొమ్మిది నెలల నుంచి 15 సంవత్సరాల వయసు ఉన్న ప్రతి విద్యార్థికి తప్పనిసరిగా టీకాలను వేయించాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో చేగుంట వైద్యాధికారి వినయ్‌కుమార్, పాఠశాల హెచ్‌ఎం నీరజ, ఉపాధ్యాయులు, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

సీపీఎస్ విధానం ఉద్యోగులకు శాపం

తూప్రాన్‌రూరల్: కంట్రిబ్యూటరీ పెన్షన్ విధానం ప్రభుత్వ ఉద్యోగులకు శాపంగా పరిణమించిందని, దానిని తక్షణమే రద్దు చేసి పాత పన్షన్ విధానాన్నే అమలు చేయాలని కోరుతూ తెలంగాణ కంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీం ఎంప్లాయీస్ అసోసియేషన్ జిల్లా ప్రతినిధులు మంగళవారం తూప్రాన్, మనోహరబాద్ మండలంలోని ప్రభుత్వ కార్యాలయాలు, పాఠశాలల్లో సీపీఎస్ విధానంపై వచ్చేనెల 1న జిల్లా కేంద్రంలో జరిగే దీక్ష కార్యక్రమాలపై అగాహన కార్యక్రమాలను చేపట్టారు. 2004 సెప్టెంబర్ 1 తర్వాత ప్రభుత్వ ఉద్యోగంలో చేరిన వారికి పెన్షన్ భద్రత లేకుండా పోయిందని వారు పేర్కొన్నారు. వచ్చేనెల 1న ప్రతి సీపీఎస్ ఉద్యోగి సామూహిక సెలవు పెట్టి జిల్లా కేంద్రంలో నిర్వహించే నిరసన దీక్షలో పాల్గొనాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా కమిటీ భాద్యులు అశోక్, బాల నర్సింహారెడ్డి, ఉపేందర్, సంతోష్, యాదగిరి, శ్రీనివాస్, సుధాకర్‌రడ్డి, సంజీవయ్య, సుదర్శన్ తదితరులు పాల్గొన్నారు.


నిరసన దీక్ష వాల్‌పోస్టర్లను ప్రదర్శిస్తున్న ఉపాధ్యాయ నాయకులు

ప్రజాపంపిణీ వ్యవస్థలో లోపాలను అధిగమిస్తాం

● జిల్లా పౌరసరఫరాల అధికారి రేవతి

చేగుంట: ప్రజా పంపిణీ వ్యవస్థలో అక్రమాలు జరగకుండా లోటుపాట్లను అధిగమించడానికి కృషి చేస్తామని జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి రేవతి పేర్కొన్నారు. మండలంలోని పలు గ్రామాల్లో రేషన్ సరుకులు టెక్నికల్ సమస్య వల్ల ప్రజలకు అందకపోవడంతో మంగళవారం టెక్నికల్ టీంతో కలిసి పలు గ్రామాల్లో పర్యటించారు. అనంతసాగర్‌లోని రేషన్‌షాపులో టెక్నికల్ సమస్యను పరిష్కరించి ప్రజలకు సరుకులను పంపిణీ చేశారు. రేషన్ షాపుల్లో ఈ పాస్ విధానం ఏర్పాటు చేయడం వల్ల అక్రమాలకు అడ్డుకట్ట పడే అవకాశముందన్నారు. ప్రతి ఒక్కరూ ఈపాస్ ద్వారా తమ సరుకులు తీసుకోవాలన్నారు. టెక్నికల్‌గా కొన్ని సమస్యలు వచ్చినా టెక్నికల్ బృందం వాటిని పరిష్కరిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో టెక్నికల్ ఫీల్డ్ ఇన్‌చార్జ్ మల్లేశ్వర్‌రావు, తహసీల్దార్ విజయలక్ష్మి, రేషన్‌డీలర్ల అసోసియేషన్ అధ్యక్షుడు శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.


అనంతసాగర్‌లో బియ్యం పంపిణీ చేస్తున్న రేవతి


తహసీల్దార్ విజయలక్ష్మితో మాట్లాడుతున్న రేవతి

మల్కాపూర్‌ను సందర్శించిన
జిల్లా సర్పంచుల బృందం


మల్కాపూర్‌లో పర్యటిస్తున్న సర్పంచులు

తూప్రాన్‌రూరల్: మండలంలోని ఆదర్శ గామామైన మల్కాపూర్‌ను మంగళవారం మదక్ జిల్లాలోని వివిద మండలాలకు చెందిన 35మంది సర్పంచుల బృందం సందర్శించింది. పచ్చగా..పరిశుభ్రంగా ఉన్న గ్రామాన్ని చూసి సర్పంచులు మంత్ర ముగ్దులయ్యారు. గ్రామంలో పర్యటించి వ్యక్తిగత మరుగుదొడ్లు, ఇంకుడుగంతల నిర్మాణాలను, ఇంటింటికీ మిషన్ భగీరథ తాగునీటి నల్లాలు, ఇళ్ల ఎదుట ఖాళీ స్థలాల్లో పెంచుతున్న పండ్ల చెట్లను చూసి ఆనందం వ్యక్తం చేశారు. సమిష్టి భాగస్వామ్యంతో గ్రామం అభివృద్ధి చెందుతున్న విషయాన్ని, యువకులు, మహిళలు సామాజిక సేవా కార్యక్రమాలను నిర్వహిస్తుండడాన్ని తెలుసుకున్నారు. ఊరంతా పచ్చదనంతో పరిశుభ్రంగా ఆహ్లాదకరంగా ఉందని తెలిపారు. ఈ బృందానికి ఈటీసి ఫ్యాకల్టీ శోభ, జిల్లా డీటీఎం బాగయ్య నాయకత్వం వహించారు. సర్పంచుల వేంట గ్రామ సర్పంచి స్వామి, స్థానిక అధికారులు, యువకులు, మహిళలు పాల్గొన్నారు.

'వార్డెన్ స్థానికంగా ఉండాలి'

చేగుంట: మండల కేంద్రంలోని బీసీ బాలుర వసతిగృహాన్ని బీసీ విద్యార్థి విభాగం జిల్లా అధ్యక్షుడు రఘు మంగళవారం ఆకస్మికంగా పరిశీలించారు. మూత్రశాలలు సరిగా లేకపోవడం, కొన్ని గదులకు దర్వాజలు లేకపోవడం వంటి అంశాలను విద్యార్థులు రఘు దృష్టికి తీసుకువచ్చారు. విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందిస్తున్న విషయాన్ని విద్యార్థులు తెలపగా వార్డెన్ కూడా స్థానికంగా ఉండాలని ఈ సందర్భంగా తెలిపారు.

ఇంటర్వ్యూ



వాణిజ్య బ్యాంకులకు దీటుగా

సహకార బ్యాంకులు

• డీసీసీబీ సీఈవో మంచి శ్రీనివాస్

జగదేవ్‌పూర్: వాణిజ్య బ్యాంకులకు దీటుగా సహకార బ్యాంకులు సేవలను అందిస్తున్నాయని జిల్లా కేంద్ర సహకార బ్యాంకు సీఈవో మంచి శ్రీనివాస్ తెలిపారు. పలు విషయాలపై ఆయన ఆంధ్రజ్యోతితో ప్రత్యేకంగా మాట్లాడారు.

సహకార బ్యాంకుల పనితీరు ఎలా ఉంది ?

వాణిజ్య బ్యాంకులకు ఏమాత్రం తీసిపోకుండా సహకార బ్యాంకలుఉ దీటుగా పనిచేస్తున్నాయి. వాటికన్నా మా బ్యాంకుల్లో అదనపు సౌకర్యాలు కల్పిస్తున్నాం.

కొత్తగా ఎన్ని శాఖలు ప్రారంభించారు ?

ఉమ్మడి జిల్లాలో కొత్తగా 15బ్యాంకులు మంజూరయ్యాయి. ఇప్పటికే పది శాఖలను ప్రారంభించాం. ఈ నెలాఖరులోగా అన్ని శాఖలను ప్రారంభిస్తాం.

పాడి పరిశ్రమకు రుణాలిస్తున్నారా?

నాబార్డు సహకారంతో పాడి పరిశ్రమకు రుణాలిస్తున్నాం. రైతులను గ్రూపులుగా ఏర్పాటు చేసి వారికి రుణాలిస్తున్నాం. సిద్దిపేట జిల్లాలోని 3500 గ్రూపులకు రుణాలిచ్చాం.

సహకార బ్యాంకుల్లో లాకర్ సౌకర్యం ఉందా?

నూతనంగా ఏర్పాటు చేస్తున్న సహకార బ్యాంకుల్లో డిజిటల్ లాకర్ల సౌకర్యం కల్పిస్తున్నాం. ఉమ్మడి జిల్లాలో ఏ బ్యాంకుల్లో లేని విధంగా డిజిటల్ లాకర్‌లు ఏర్పాటు చేశాం.

ఖాతాదారులకు గృహ రుణాలను ఇస్తున్నారా ?

గ్రామీణ ప్రాంతాల్లోని రైతులకు గృహ రుణాలు కూడా ఇస్తున్నాం. అలాగే విదేశాల్లో చదువుకునే వారికి కూడా ఎడ్యుకేషన్ లోన్స్ ఇస్తున్నాం.

చిరు వ్యాపారులకు ఎలాంటి రుణాలందిస్తున్నారు ?

సహకార బ్యాంకుల ద్వారా చిరు వ్యాపారులకు రుణాలివ్వడానికిగానూ స్వయం కృషి పథకం ప్రవేశపెట్టాం. ఈ పథకం ద్వారా చిరు వ్యాపారులకు రూ. 50 వేల నుంచి రూ. 2లక్షల వరకు రుణాలు ఇస్తున్నాం.

సేద్యం

ఓ యువకుడు ప్రైవేటు కొలువు చేస్తూనే, ఆధునిక పద్ధతులతో పంటలను సాగుచేస్తూ అందరికీ ఆదర్శంగా నిలుస్తున్నాడు. గ్రామంలో అందరికంటే భిన్నంగా పందిరిసాగు విధానం ద్వారా కూరగాయలను పండిస్తూ అధిక దిగుబడులను సాధిస్తున్నాడు. అలాగే వరి, మొక్క జొన్నవంటి పంటలనూ సాగు చేస్తున్నాడు. అన్ని పంటల్లోనూ అధిక దిగుబడులను సాధిస్తున్నాడు.



బీర కాయలను తెంపుతున్న రైతు నర్సింలు

పందిరి సాగుతో..

లాభాల బాటలో!

• కూరగాయల సాగు ద్వారా అధిక ఆదాయం పొందుతున్న యువకుడు
• ప్రైవేటు కొలువు చేస్తూనే పంటల సాగులో రాణింపు

తూప్రాన్‌రూరల్ : అంబటి నర్సింలుది తూప్రాన్ మండలం ఇస్లాంపూర్ గ్రామం. ఈయన ఐడీఏ బొల్లారం ప్రాంతంలోని ప్లయివుడ్ ఫర్నీచర్ కంపెనీలో ఆపరేటర్‌గా పనిచేస్తున్నాడు. రోజూ ఇంటి వద్ద నుంచే రాకపోకలు చేస్తాడు. ఉదయాన్నే పొలం దగ్గరకు వెళ్లి అక్కడంతా కలియతిరిగి సాగవుతున్న పంటలను చూసుకొని కంపెనీకి వెళ్తారు. సాయంత్రం రాగానే నేరుగా పొలం దగ్గరకు వెళ్లి అటునుంచి ఇంటికి వెళ్తారు. కూరగాయలు చేతికొచ్చినపుడు పొద్దున్నే వాటిని గంపల్లో నింపుకొని మార్కెట్‌కు తీసుకుపోయి అమ్ముకొని వచ్చిన తర్వాత కంపెనీకి పోవడం ఆయన దినచర్య. పంటలు వేసిన తర్వాత పొలం పనులను అతని భార్యనే చూసుకుంటారు. కూలీలతో పనిచేయించడం, పంటలకు కావాల్సిన ఎరువులను చల్లించడం, కలుపుతీయించడం, కూరగాయలను కోయించడం లాంటి వ్యవవసాయ పనులను ఆమెనే చూసుకుంటారు. దంపతులిద్దరూ కలిసి రోజంతా కష్టపడుతూ సంతోషంగా జీవనం సాగిస్తున్నారు. ఈయనకున్న రెండకరాల పొలంలో ఎకరంబావు భూమిలో మూడేళ్ల క్రితం కూరగాయలు పండించేందుకు పందిళ్లు వేశారు. ఇందుకు ఎకరాకు రూ.2లక్షల వరకు ఖర్చు రాగా అందులో ప్రభుత్వం సగం సబ్సిడీని అందించింది. పశువుల ఎరువు, కోడి ఎరువు లాంటి సేంద్రియ ఎరువులను వాడుతున్నారు. మూడేళ్ల నుంచి డ్రిప్ విధానం ద్వారా పందిళ్లతో బీర, కాకర, సొరకాయలను పండిస్తున్నాడు. యేడాదిలో మూడుసార్లు క్రాప్ తీస్తున్నాడు. పందిరి కింద విత్తనాలు నాటే ప్రదేశంలో కాలువలు తీసి అందులో ఎకరాకు 30 టన్నుల కోడి, పశువుల ఎరువులను చల్లి సాగుకు సిద్ధం చేసుకుంటాడు. మేడ్చల్ జిల్లాలో పందిరి విధానంతో ఎక్కువగా కాయకూరలను సాగుచేసే తూంకుంట ప్రాంతం నుంచి విత్తనాలను తీసుకొచ్చి ప్రైవేటు నర్సరీల నిర్వాహకులకు ఇస్తారు. వారు 21రోజుల పాటు మొక్కలను పెంచి ఇస్తారు. వాటిని తీసుకొచ్చి కూలీల చేత నాటిస్తారు. నర్సింలు ఎక్కువగా గోల్డన్ రకం బీర, వీన్‌ఆర్ రకం కాకర, సొరకాయ విత్తనాలను వాడుతున్నాడు. వాటితో పాటు పక్కన కొంత భూమిని కౌలుకు తీసుకొని అందులో వరి, మొక్కజొన్న పంటలను వేశాడు. మే చివరి వారంలో బీర మొలకులను నాటితే 40 రోజుల తర్వాత కాయకాయడం ప్రారంభమవుతుంది. రెండు నెలల వరకు (జూలై వరకు) పంట ఉంటుంది. ప్రస్తుతం సాగులో ఉన్న బీరకాయలకు మంచి గిట్టుబాటు ధర ఉంది. రోజుకు 4క్వింటాళ్ల కాయలు కోతకు వస్తాయి. ఈ పంట కాపు అయిపోయాక ఆగస్టు రెండో వారం తర్వాత కాకర సాగుకు సిద్ధమవుతారు. ఈ రకంగా పందిరిసాగుతో యేడాదికి మూడు పంటలు తీస్తూ అన్ని ఖర్చులు పోనూ పంటకు రూ. లక్ష వరకు సంపాదిస్తున్నట్లు నర్సింలు చెప్పాడు. ఈయన విత్తనాలను తూంకుంట నుంచి తీసుకొస్తారు, పురుగుల మందులను మాత్రం కిసాన్ కాల్ సెంటర్ అందించే సలహాలతో తీసుకొచ్చి 15 రోజులకొకసారి పిచికారీ చేస్తాడు. గత రబీ సీజన్‌లో నర్సింలు రెండెకరాల వరిపంటను సాగుచేశాడు. ఎకరాకు 38 క్వింటాళ్ల దిగుబడితో మండలంలోనే ఆదర్శంగా నిలిచాడు.



తెంపిన బీరకాయలను బాక్సుల్లో నింపుతున్న దృశ్యం



బీరకు మందులు పిచికారీ చేస్తున్న దృశ్యం

అదను ప్రకారం సాగు చేస్తే మంచి లాభాలు



కాయగూరలను ఏప్రిల్, మే నెలల్లో సాగుచేస్తే అధిక దిగుబడులు, లాభాలు వస్తాయి. సేంద్రియ ఎరువులతో, డ్రిప్ పద్ధతిని ఉపయోగించి సాగుచేయడం అలవాటు చేసుకుంటే మంచిది. ఒక్కసారి లాభాలు కనిపిస్తే ఇక కూరగాయ సాగును వదులుకోరు. ప్రభుత్వం సబ్సిడీపై చిన్న ట్రాక్టర్‌ను అందిస్తే బాగుంటుంది. పందిరిసాగు గురించి దరఖాస్తు చేస్తే మండలంలోనే మొదటిసారి నాకే సబ్సిడీ మంజూరైంది. సద్వినియోగం చేసుకున్నా.

\- నర్సింలు

సాగు పనులంటే ఎంతో ఇష్టం

మా ఆయనకైనా, నాకైనా పొలం పనులంటే చాలా ఇష్టం. వ్యవసాయ పనులన్నీ నేనే చూసుకుంటా. కూరగాయల సాగుతో మంచి ఆదాయం వస్తుంది. కొత్త పద్ధతులతో సాగు చేస్తున్నందున దిగుబడులు కూడా మంచిగొస్తున్నాయి. వరిపంటలతో పాటు కూరగాయ పంటలను వేస్తున్నందున కష్టం ఎక్కువవుతున్నా ఎపుడూ పైసలు చేతిలో కనిపిస్తున్నాయి. నా భర్త సెలవు రోజుల్లో పూర్తిగా పొలం పనులే చూసుకుంటాడు.

\- జ్యోతి (నర్సింలు భార్య)

నూతన జిల్లాల వారీగా డీఎస్సీని ప్రకటించాలి

• కొత్త జిల్లాల డీఎస్సీ సాధన సమితి రాష్ట్ర కార్యదర్శి మహబూబ్‌అలీ

ఉద్యోగపర్వం



నూతన జిల్లాల వారీగా డీఎస్సీని ప్రకటించాలి. సుప్రీం కోర్టు ఆదేశాల మేరకు త్వరలో ప్రభుత్వం ప్రకటించనున్న డీఎస్సీని కొత్త జిల్లాలను దృష్టిలో ఉంచుకుని ప్రకటించాలి. మూడేళ్లుగా నిరుద్యోగులు ఎంతో ఆశగా ఎదురు చూస్తున్నా.. ఉపాధ్యాయ ఖాళీలను ప్రభుత్వం భర్తీ చేయలేదు. నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వానికి ఉంది. డీఎస్సీ ద్వారా ఉపాధ్యాయ ఖాళీలను భర్తీ చేయాలని న్యాయస్థానాలు ఆదేశించినా ప్రభుత్వం ఇంకా మీనమేషాలు లెక్కిస్తోంది. ప్రభుత్వ తీరుపై న్యాయస్థానాలు ఎన్ని మొట్టికాయలు వేసిన నేతల్లో చలనం లేదు. కొత్త జిల్లాల ప్రకారం నియామకాలు చేపట్టి మారుమూల సరిహద్దు ప్రాంతాల సమగ్రాభివృద్ధికి అవకాశం కల్పించాలని కోరుతున్నాం. కొత్త జిల్లాల ఏర్పాటు ద్వారానే సమగ్ర తెలంగాణ అభివృద్ధి సాధ్యమని భావించిన సీఎం కేసీఆర్ అదే తరహాలో డీఎస్సీ నియామకాలు చేపడితేనే బంగారు తెలంగాణ సాధ్యమవుతుంది.


\- పుల్‌కల్

వేంకటేశ్వరుడి సన్నిధిలో పెళ్లి.. పదికాలాలు పదిలం

భక్తి

• బెల్లంకొండ శ్రీనివాసచార్యులు, కల్యాణ సుందర వేంకటేశ్వరస్వామి ఆలయ పూజారి





పుల్‌కల్ మండలం సింగూరు గ్రామంలో వెలసిన కల్యాణ సుందర వెంకటేశ్వరస్వామి ఆలయంలో పెళ్లిళ్లు నిర్వహిస్తే పదికాలాల పాటు పదిలంగా ఉంటాయి. ధూప, దీప, నైవేద్యాలతో, నిత్య కల్యాణం, పచ్చతోరణంలా విరాజిల్లుతున్న వేంకటేశ్వరస్వామిని దర్శించుకుంటే కోరిన కోర్కెలు తీరుతాయని భక్తుల నమ్మకం. సింగూరు వేంకటేశ్వర స్వామి ఆలయంగా ఇది ప్రసిద్ధి చెందింది. సంగారెడ్డితో పాటు జోగిపేట, సదాశివపేట, జహీరాబాద్, నారాయణఖేడ్ తదితర ప్రాంతాల నుంచి భక్తులు ఇక్కడికి వస్తుంటారు. సమీపంలోనే ప్రాజెక్టు ఉండటంతో సందర్శకుల తాకిడి ఎక్కువ. సింగూరు ప్రాజెక్టు నిర్మాణ సమయంలో దాదాపు ముప్పై ఏళ్ల క్రితం నీటి పారుదల శాఖ అధికారులు, అప్పటి కాంట్రాక్టర్లు అందజేసిన విరాళాలతో ఈ ఆలయాన్ని నిర్మించారు. ఆలయ ప్రాంగణంలో పెళ్లిళ్లు, ఇతర శుభకార్యాలతో పాటు రాజకీయ పార్టీల నాయకులు సభలు, సమావేశాలు సైతం నిర్వహిస్తుంటారు. బ్రహ్మ, విష్ణు, మహేశ్వరులకు సంబంధించిన ఉసిరి, రాగి, మేడి చెట్లు ఉండటంతో ఆయల దర్శనకు వచ్చిన భక్తులు ఆయా చెట్ల చుట్టూ ప్రదక్షిణలు చేస్తారు. దీంతో మనశ్శాంతి, ఆరోగ్యం లభిస్తుంది. రుణబాధలు దూరమవుతాయి.

\- పుల్‌కల్

కులవృత్తి దూరమైంది..

కూలీ బతుకే మిగిలింది

- కళలకు కాలం చెల్లడంతో వీధినపడ్డ దాసరి కులస్థులు
- వెంట్రుకల సేకరణతో ఉపాధి పొందుతున్న మహిళలు
- ఇబ్బందుల మధ్య కాలం వెళ్లదీస్తున్న దాసరులు


ఇల్లిల్లూ తిరిగి వెంట్రుకలను సేకరిస్తున్న దాసరి మహిళలు

తూప్రాన్‌రూరల్: ముఖానికి రంగులేసుకొని తంబూరలు పట్టుకొని చిందులు వేస్తూ వీధి బాగోతాలు, యక్షగానాల ప్రదర్శనలిస్తూ ప్రజలను మైమరపించి మెప్పించి జీవనం గడుపుకునే దాసరోళ్లకు కుల వృత్తి దూరమైంది. మారుతున్న కాలానుగుణంగా వీధి బాగోతాలకు ఆదరణ కరువైంది. దీంతో అవి కనుమరుగయ్యాయి. దాసరి కులస్థుల బతుకులు ఆగమై రోడ్డునపడ్డారు. జీవనోపాధి కోసం కూలీబాట పడుతున్నారు. మగవారు వంటపాత్రల (బాసండ్ల) మూటలను సైకిళ్లపై పెట్టుకొని ఊరూరు తిరుగుతూ అమ్ముతూ కుటుంబాన్ని పోషిస్తున్నారు. ఇక ఆడవారు ఇల్లిల్లూ తిరిగి తల వెంట్రుకల సేకరణ చేపడుతూ, బాసండ్లు, దువ్వెన్లు, పక్కపిన్నీసులను, సవరాలను తయారుచేసి అమ్ముతూ చాలీచాలని కూలి డబ్బులతో కాలం వెల్లదీస్తున్నారు. వీరంతా కొన్ని యేళ్ల నుంచి కులవృత్తికి దూరమై వలస బతుకులకు అలవాటుపడ్డారు. పొద్దున లేవగానే దాసరి కులానికి చెందిన మహిళలు గ్రామాల్లో తిరుగుతూ వెంట్రుకలు తీసుకుంటాం, బాసండ్లు ఇస్తాం అంటూ కాలనీల్లో తిరగుతుంటారు. మహిళల నుంచి తలలో నుంచి రాలిపోయిన వెంట్రుకలను తీసుకొని దానికి బదులుగా వంటసామాన్లను, అలంకరణ వస్తువులను ఇస్తుంటారు. ఇలా సేకరించిన పొడవాటి వెంట్రుకలతో సవరాలు తయారు చేసి వెంట్రుకలు తక్కువగా ఉండే మహిళలకు వంద రూపాయలకొకటి లెక్కన అమ్ముతూ ఉంటారు. మిగాతా వెంట్రుకలను ఎక్కువగా సేకరించి హైదరాబాద్‌కు వెళ్లి కిలో లెక్కన అమ్ముకొని వస్తారు. కిలో వెంట్రుకలు అమ్మితే రూ. 2వేలు వస్తాయట. అలా నెలకు రెండు కిలోల వరకు వెంట్రుకలను జమ చేసి అమ్ముతూ ఆ డబ్బులతో కుటుంబాలను పోషించుకుంటున్నారు. తూప్రాన్, మనోహరబాద్ మండలాల్లోని పలు గ్రామాల్లో ఈ దాసరి కులస్థులు ఉన్నారు. వీరంతా కులవృత్తులను మరిచిపోయి ఇతర ప్రత్యామ్నాయ ఉపాధి మార్గాలను వెతుక్కొని జీవనం గడుపుతున్నారు. చేగుంట మండలానికి చెందిన దాసరి మహిళలు తూప్రాన్, మనోహరబాద్ మండలాల్లోని ప్రతి గ్రామంలో తిరుగుతూ వెంట్రుకల సేకరణ చేస్తున్నారు. మహిళల నుంచి సేకరించిన వెంట్రుకలతో విగ్గులు, సవరాలు తయారవుతాయి. అలాగే హెయిర్ ప్లాంటేషన్‌కు ఇవి పనికొస్తాయి. ఇంకా అనేక రకాలుగా ఉపయోగపడతాయి. ఊరూరు తిరిగి వెంట్రుకలను సేకరించేవారికి కూలి డబ్బులే దక్కుతుండగా వాటిని కొనుగోలు చేసే వారికి మాత్రం లాభాల పంట పండుతోంది. మహిళల ఊడిన వెంట్రుకలు కొన్ని కుటుంబాలకు కూడు పెడుతుండడం గొప్ప విషయమే. ఉపాధి మార్గాల్లో వెంట్రుకల సేకరణ కూడా ప్రధాన అంశంగా మారిపోయింది.

సవరాలను అల్లుతూ పూటగడుపుకుంటున్నాం



మాది బాగోతాలు వేసి పొట్టపోసుకునే కులం. కానీ కులవృత్తి అంతరించిపోవడంతో నానా ఇబ్బందులుపడుతున్నాం. బతుకుదెరువుకు బజారున పడ్డాం. పొద్దున లేవగానే ఊర్లల్లో వెంట్రుకలను సేకరించి వాటితో సవరాలు తయారు చేసి అమ్ముకంటూ జీవిస్తున్నాం. రోజుకు వంద రూపాయలు కూడా కూలీ పడ్తలేదు. నెలంతా తిరిగితే రెండు కిలోల వెంట్రుకలు కూడా జమకావు. వాటిని అమ్మితే మూడు వేల రూపాయలు వస్తాయి. ఈ వృత్తే మాకు అలవాటయింది. సవరాలను అమ్ముతూ ఎలాగోలా బతుకు ఈడుస్తున్నాం. ప్రభుత్వం మాకు ఏదైనా ఉపాధి కల్పించాలి.

- దాసరి గంగమ్మ

సర్కారు బతుకుదెరువు చూపించాలి




మావి వలసబతుకులయ్యాయి. రోజూ ఐదారు గ్రామాల్లో తిరిగి వెంట్రుకలను సేకరించుకొస్తాం. వాటితో ఆడవారికి సవరాలను తయారు చేసి అమ్ముకుంటాం. ఈ పనితో రోజుకు రూ. వంద కూడా కూలీ దక్కడం లేదు. ఏదో మాకు వచ్చిన పనిని చేస్తున్నాం. ఈ పని తప్ప మాకు వేరే పని తెలియదు. కుల వృత్తి దూరమై బతుకులు ఆగమయ్యాయి. ప్రభుత్వం మా గరీబోళ్లకు సాయం చేయాలే. మాకు, మా పిల్లలకు బతుకు దెరువును చూపించి ఆదుకోవాలి.

-దాసరి లక్ష్మి

పూజలు అందుకునేందుకు వినూత్నమైన రూపాల్లో రుపుదిద్దుకున్న గణేశుడి ప్రతిమలు అంతటా సిద్ధమయ్యాయి. విగ్రహాలను భక్తులు ఇప్పటికే అడ్వాన్సులు ఇచ్చి బుక్ చేసుకున్నారు. ఈ నెల 25న రాత్రి మండపాల్లో విగ్రహాలు కొలువుదీరనున్నాయి. ఇక నిర్వాహకులు మండపాలను సిద్ధం చేసే పనిలో నిమగ్నమయ్యారు. సిద్దిపేటలోని ప్రధాన రహదారులైన హైదరాబాద్, మెదక్, కరీంనగర్ రోడ్లల్లో విక్రయ కేంద్రాలు ఏర్పాటు చేశారు. ఇప్పటికే చాలామంది విగ్రహాలను మండపాల వద్దకు తరలించారు. భారీ విగ్రహాలను ఏర్పాటు చేసేవాళ్లు విగ్రహాన్ని ముందస్తుగానే తెచ్చి తర్వాత మండపం ఏర్పాటు చేస్తున్నారు. తొమ్మిది రాత్రులు 21 రకాల పత్రాలతో లంబోదరుడికి పూజలు చేసేందుకు భక్త జనం సిద్ధమయ్యారు. జై బోలో గణేశ్ మహరాజ్‌కీ అంటూ కాలనీలు మార్మోగనున్నాయి.

- సిద్ధిపేట రూరల్


సిద్దిపేటలోని విక్రయ కేంద్రంలో హంసపై కూర్చొని ఉన్న వినాయక విగ్రహాలు

వినాయక.. కొలువుదీరనున్నాడిక!

- అంతటా ముమ్మరంగా ఏర్పాట్లు
- మండపాల నిర్మాణంలో బిజీగా ఉన్న నిర్వాహకులు
- వినూత్న రూపాల్లో లభ్యమవుతున్న విగ్రహాలు
- కొన్ని చోట్ల ఇప్పటికే విగ్రహాల తరలింపు
- విక్రయకేంద్రాలకు తరలివస్తున్న జనం

పెద్దశంకరంపేట : వినాయక చవితి సందర్భంగా పెద్దశంకరంపేటలో విగ్రహాలు అమ్మకానికి సిద్ధంగా ఉన్నాయి. గతంలో దూర ప్రాంతాలకు వెళ్లి ప్రజలు ప్రతిమలు కొనుగోలు చేసే వారు. ప్రస్తుతం మాత్రం స్థానికంగానే లభిస్తున్నాయి. హైదరాబాద్, మహారాష్ట్ర తదితర ప్రాంతాల నుంచి వినాయక విగ్రహాలను తీసుకొచ్చి వ్యాపారులు పెద్దశంకరంపేటలో విక్రయిస్తున్నారు. పలు రూపాల్లో అందంగా ఉన్న విగ్రహాలు అందరినీ ఆకట్టుకుంటున్నాయి. లాల్‌బాగ్, అష్టవినాయక్, గరుడ, నంది వాహనంపై కూర్చున్న వినాయకుల విగ్రహాలతో పాటు వివిధ రూపాల విగ్రహాలు పేటలో దొరుకుతున్నాయి. పెద్దశంకరంపేట, అల్లాదుర్గం, రేగోడు, టేక్మాల్, పాపన్నపేట, కల్హేర్ తదితర మండలాల గ్రామాల నుంచి వినాయక విగ్రహాలను కొనుగోలు చేసేందుకు ప్రజలు ఆసక్తి చూపుతున్నారు. కాగా చిన్న పాటి వినాయకుల ధర రూ.150 నుంచి లభిస్తున్నాయి. పెద్ద విగ్రహాలు రూ. రెండు వేల నుంచి రూ. ఎనిమిది వేల మధ్య లభిస్తున్నాయి. ఈ సారి వ్యాపారం బాగా సాగుతోందని వ్యాపారులు శివ, సాయి హుస్సేన్ తెలిపారు.


విక్రయానికి సిద్ధంగా ఉన్న వినాయక ప్రతిమలు


సిద్దిపేటలో భారీ విగ్రహాన్ని ఆసక్తికరంగా చూస్తున్న పిల్లలు


వినూత్న రూపాల్లో గణేశుడి విగ్రహాలు

రాగి పాత్ర.. ఆరోగ్య ప్రదాత

- రాగి పాత్ర ద్వారా వ్యాధులు నివారించవచ్చు
- రాగి చెంబులో నిలువ ఉంచిన నీటిని తాగితే చాలా ప్రయోజనాలు

అక్కన్నపేట: మనకు నీటి ద్వారానే ఎక్కువ వ్యాధులు సంక్రమిస్తాయి. అలాంటి రోగాలు మన దరి చేరకుండా రాగి పాత్ర ఆరోగ్య ప్రదాతలా పనిచేస్తుంది. రాగి పాత్రలోగాని, రాగి చెంబులోగాని నిలువ ఉంచిన నీటిని తాగడం వల్ల ఆరోగ్యానికి మేలు చేకూరుతోంది. ప్రస్తుత రోజుల్లో నీటి శుద్ధికి చాలామంది వాటర్ ఫిల్టర్లను వాడుతున్నారు. కానిపూర్వ కాలంలో రాగి పాత్రలో నిల్వ ఉంచిన నీటినే తాగేవారు. ఎందుకంటే ఆ నీరు సహజంగా శుద్ధి అయ్యేది. రాగి పాత్రలో నీటిని నిల్వ ఉంచితే అందులోని సూక్ష్మ జీవులు ఇట్టే నాశనం అవుతాయి. రాత్రంతా రాగి పాత్రలో నిల్వ ఉన్న నీటిని ఉదయాన్నే తాగడం ఆరోగ్యానికి ఎంతో మంచిదని ఆయుర్వేదం కూడా చెబుతున్నది. కఫ, వాత, పిత్తా దోషాలను సమన్వయం చేసేందుకు ఇది ఎంతగానో ఉపయోగపడుతుంది. శరీంలోని వివిధ అవయవాల పనితీరు మెరుగు పరిచేందుకు రాగి పాత్ర ఎంతగానో సహకరిస్తుంది.

- రాగి పాత్రలోని నీటిని తాగడం వల్ల కడుపులో మంట తగ్గుతుంది. అల్సర్లు తగ్గడానికి జీర్ణ వ్యవస్థ పనితీరు మెరుగు పడటానికి కాలేయం, కిడ్నీల పనితీరు మెరుగు పడటానికి దోహదపడుతుంది.
- బరువు తగ్గాలనుకునే వారు రాగి పాత్రలో నిల్వ ఉంచిన నీరు తాగడం ప్రయోజకరం. శరీరంలో పేరుకు పోయి కొవ్వును కరిగించేందుకు ఇది దోహం చేస్తుంది. జీర్ణక్రియ మెరుగుపడేలా సహాయపడుతుంది.
- గాయాలు త్వరగా మారడానికి రోగనిరోధక వ్యవస్థను బలోపేతం చేసి కొత్త కణాల ఉత్పత్తికి దోహదం చేస్తుంది. ముఖ్యంగా కడుపులో ఏర్పడ్డ గాయాలు మానేందుకు సహాయపడుతుంది.
- వృద్ధాపచాయాలు త్వరగా రాకుండా కాపాడుతుంది.
- చర్మవ్యాధుల బారిన పడకుండా, రక్తహీనత తగ్గించడానికి ఉపకరిస్తుంది. కీళ్ల నొప్పులు రాకుండా కాపాడుతుంది.
- ఇన్‌ఫెక్షన్లు రాకుండా ఉంచుతుంది. థైరాయిడ్ గ్రంథి పనితీరు మెరుగు పడేందుకు ఈ నీరు ఎంతో దోహదపడుతుంది.
- రక్త పోటును నియంత్రణలో ఉంచుతుంది.
- క్యాన్సర్ వచ్చే ముప్పును కూడా ఇది తగ్గిస్తుంది. ఇందులో యాంటి యాక్సిడెంట్ గుణాలు క్యాన్సర్‌కు కారణమయ్యే కణాలతో పోరాడుతాయి.



పొలం వద్ద జర భద్రం



- వర్షాకాలంలో పంట పొలాల వద్ద పొంచి ఉన్న ప్రమాదాలు
- అవగాహన లోపంతో బలవుతున్న రైతులు
- జాగ్రత్తలు పాటిస్తే ప్రమాదాలు దూరం

అక్కన్నపేట: వేలాడే తీగలు, కంచెలేని ట్రాన్స్‌ఫార్మర్లు, వైర్లు తేలిన స్టాటర్లు, మోటర్లకు కట్టే ఇనుప తీగలు పంట పొలాల రక్షణ కోసం వేసే విద్యుత్ కంచెలు ఇలా పంట చేళ్ల వద్ద విద్యుత్ రూపంలో ప్రమాదాలు పొంచి ఉంటాయి. ఖరీఫ్ పనుల మమ్మురం కావడంతో రాత్రనకా, పగలనక పొలాలకు నీరు పెట్టేందుకు వెళ్లే రైతులు ఏ మాత్రం నిర్లక్ష్యంగా ఉన్న విద్యుదాఘాతంతో ప్రాణాలు కోల్పోవాల్సి వస్తుంది. వర్షాకాలం కావడంతో తడి నేల వల్ల విద్యుత్ ప్రమాదాలు సంభవిస్తుంటాయి. రైతులు ఎలాంటి జాగ్రత్తలు పాటించాలో తెలుసుకుంటే చాలా మంచిది.

విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ల వద్ద మరమ్మతులు చేయొద్దు

చాలా సందర్భాల్లో రైతులే ట్రాన్స్‌ఫార్మర్ల వద్ద చిన్న చిన్నమరమ్మతులు చేస్తుంటారు. ఫ్యూజ్ వైర్లు వేయడం ఇందులో ఒకటి. దీని వల్ల ప్రమాదాలు చోటుచుసుకునే అవకాశాలు ఎక్కువగా ఉంటాయి. ట్రాన్స్‌ఫార్మర్ల ఏబీ స్విచ్ పూర్తిగా నిలిచిపోక పోతే విద్యుత్ సరఫరా అయి ప్రమాదాలు చోటుచేసుకుంటాయి. అందువల్ల రైతులు ట్రాన్స్‌ఫార్మర్లలో మరమ్మతులు చేయవద్దు. ఒక వేళ చేయాల్సి వస్తే ముందుగా విద్యుత్‌శాఖ అధికారులకు, సిబ్బంది సమాచారం ఇవ్వాలి. ట్రాన్స్‌ఫార్మర్ల ఎర్త్‌వైపు ఎట్టి పరిస్థితుల్లోను వెళ్లవద్దు.

విద్యుత్ మోటార్ల వద్ద జాగ్రత్తగా ఉండాలి

- రైతులు నాణ్యమైన ఐఎస్ఐ కంపెనీ మోటర్లను మాత్రమే వినియోగించాలి. ఒక ఫేస్ తీగ కాలితే మోటార్ మొత్తానికి విద్యుత్ సరఫరా అవుతుంది. ఆ సమయంలో విద్యుత్ మోటర్లకు, వాటికి కట్టిన తీగ తగిలిన షాక్‌గురయ్యే ప్రమాదం ఉంది.
- స్విచ్ ఆన్ చేసిన మోటార్ నడవక పోతే ఎట్టి పరిస్థితుల్లోను ముట్టుకోవద్దు.
- అలాంటి సందర్భాల్లో టెస్టర్ సహాయంతో మోటర్ బాడిని చెక్ చేయాలి.
- పంట పొలాల వద్ద ఉన్న మోటర్‌పై తప్పకుండా రక్షణ కవచం ఉండాలి.
- మోటర్ వర్షంలో తడవకుండా చూడాలి. ఓ షెడ్డు ఏర్పాటు చేసుకుని తడిలేని చోట మాత్రమే అమర్చుకోవాలి.
- మోటర్‌కు, స్టాటర్లకు తప్పని సరి ఎర్తింగ్ వైర్ ఏర్పాటు చేసుకోవాలి. ఏవైనా మరమ్మతులు అవసరమైనప్పుడు విద్యుత్ అధికారులకు సమాచారం ఇస్తే సరఫరా నిలిపి వేస్తారు.
- తడి చేతులతోగాని వర్షంలోకాని ఎట్టి పరిస్థితుల్లో మోటార్లు, స్టాటర్లను ముట్టుకోకూడదు.
- సాధ్యమైనంత వరకు మెకానిక్‌లతో మరమ్మతులు చేయించడం మంచిది.
- స్థంభాలు ఒరిగినా, విద్యుత్ వైర్లు కొన్ని పొరలు తెగినా విద్యుత్ శాఖ అధికారుల దృష్టికి తీసుకెళ్లాలి.

పొడి ప్రదేశాల్లో స్టార్టర్ల ఏర్పాటు

- పొడిగా ఉన్న ప్రదేశంలో స్టార్టర్లను ఏర్పాటు చేసుకోవాలి.
- స్టార్టర్లకు రక్షణ కవర్లను ఎట్టి పరిస్థితుల్లోతీసివేయవద్దు. స్టార్టర్లకు బాక్సు ఏర్పాటు చేయాలి. ఫ్యూజ్ వైర్లు, ఫ్యూజులు లూజ్‌గా ఉండరాదు.
- వర్షాకాలంలో రైతులు స్టాటర్ల బాక్సుల వద్ద జాగ్రత్తగా ఉండాలి.
- స్టార్టర్లలోకి నీరు పోకుండా చూసుకోవాలి.
- స్టార్టర్ బాక్సులోకి ఎలుకలు చేరితే తీగలను కొరికే ప్రమాదం ఉంది. అందువల్ల తరచూ చెక్‌చేస్తూ ఉండాలి.

తెగిన విద్యుత్ తీగలతో జాగ్రత్త

- సర్వీస్ వైర్లు తెగినప్పుడు గుడ్డ ముక్కలు, టేపులు చుట్టి వాడతారు. కాని ఇది సరికాదు. వీలైనంత వరకు తెగని తీగలనే వాడాలి.
- మోటార్ వద్ద భూమిపైనే తీగలు పడి ఉన్న పట్టించుకోరు. తీగ ఎక్కడ చిన్నగా తెగినా నడిచేటప్పుడు లేదా ఇచ్ ఆన్, ఆఫ్ చేసేటప్పుడు శరీరానికి తగిలి ప్రమాదం చోటుచేసుకుంటుంది. అందువల్ల తీగలు భూమి మీద లేకుండా చూసుకోవాలి.
- విద్యుత్ స్థంబాల చుట్టూ చెట్లు లేకుండా జాగ్రత్తపడాలి. లైన్ వెళ్లే చోట కొమ్మలు తగులుతూ ఉంటే ప్రమాదకరం. చెట్ల కొమ్మలు.. టూ ఫేజ్ తీగలకు తగిలితే మంటలు లేస్తాయి. ఇది ప్రమాదకరం.

రైతులు జాగ్రత్తగా ఉండాలి



విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ల వద్ద రైతులు ఏబీ స్విచ్‌లను ఆపరేట్ చేయవద్దు. ట్రాన్స్‌ఫార్మర్ వద్ద చిన్న చిన్న మరమ్మతులు రైతులే చేసుకుంటారు. ఇది చాలా ప్రమాదకరం. ఏదైనా సమస్య ఉంటే విద్యుత్ సిబ్బందికి వెంటనే తెలియజేయాలి. రైతులు మోటార్లు తడిప్రదేశంలో ఉంచడం వల్ల తరచు ప్రమాదాలు చోటుచేసుకుంటూ ఉంటాయి. కొన్ని సార్లు స్టార్టర్ ఆన్‌చేయగానే మోటార్ నడవదు. రైతులు వెంటనే మోటర్‌ను పట్టుకోవడం వల్ల ప్రమాదాలు ఏర్పడతాయి. నాణ్యమైన ఐఎస్ఐ కంపెనీ మోటర్లను మాత్రమే వినియోగించాలి. అతుకులు లేని సర్వీస్ వైర్లను ఉపయోగించాలి. రాత్రి పూట తప్పకుండా టార్చ్‌లైట్ వెంట ఉంచుకుని స్టాటర్ ఆన్, ఆఫ్ చేయాలి.

- కావలి రామచంద్రయ్య, డీఈ, ట్రాన్స్‌కో , హుస్నాబాద్

మూడేళ్ల క్రితం నవంబరు 29 ఏ వారమవుతుంది?

మెంటల్ ఎబిలిటీ



Panditi Meenakshi Pavan
Senior Faculty

Competitive Exams Special

1. ఒక కోడ్ భాషలో PEACEను FEDIUగా రాశారు. అదే కోడ్‌లో FAITH ను ఎలా రాస్తారు?
ఎ) IVLEK బి) KLEVI
సి) EIKLK డి) ఏదీకాదు

2. ఒక కోడ్‌లో GENIUSను TVJOFHగా రాశారు. అదే కోడ్‌లో NATUREను ఎలా రాస్తారు?
ఎ) OBUSVF బి) FSVUBO
సి) UBOVFS డి) ఏదీకాదు

3. ఒక కోడ్‌లో GOODను 76గా రాశారు. అదే కోడ్‌లో HEARను ఎలా రాస్తారు?
ఎ) 67 బి) 58 సి) 49 డి) ఏదీకాదు

4. ఒక కోడ్‌లో STUDENTను FPWDRRRగా రాశారు. అదే కోడ్‌లో TEACHERను ఎలా రాస్తారు?
ఎ) XCUGISC బి) SCXCUGI
సి) IGUCSCX డి) ఏదీకాదు

(5 - 7) ఒక కోడ్ భాషలో
nic sac tic అంటే all are good
sac mic mec అంటే good luck people
tic mec rac అంటే all people nice
పై కోడ్ భాష ఆధారంగా కింది ప్రశ్నలకు సమాధానాలు తెలపండి.

5. sac నకు సరైన కోడ్?
ఎ) good బి) luck సి) are డి) ఏదీకాదు

6. rac నకు సరైన కోడ్?
ఎ) luck బి) nice సి) all డి) people

7. mec నకు సరైన కోడ్?
ఎ) all బి)good సి)people డి) luck

8. 10, 5.5, 6.5, 15, 64, ------
ఎ) 520 బి) 256 సి) 128 డి) 156

9. 600, 120, 30, 10, 5, ------
ఎ) 6 బి) 8 సి) 4 డి) 5

10. 68, 14, 85, 13, 93, 12, 89, ----
ఎ) 15 బి) 16 సి) 17 డి) 18

11. 5, 6, 11, 17, 28, 45, ------
ఎ) 73 బి) 75 సి) 78 డి) 81

(12 - 14) భిన్నమైన దానిని తెలపండి?

12. ఎ) LOP బి) KPO సి) TGW డి) IRM

13. ఎ) 347 బి) 819 సి) 628 డి) 529


14. ఎ) రాగి బి) తగరం సి) తుత్తినాగం డి) జింక్

15. FAME : GOCH :: KING : --------
ఎ) IPKM బి) IKMP సి) PMKI డి) ఏదీకాదు

16. గడియారంలో సమయం గం7.30నిలు అయింది. నిమిషాల ముల్లు ఈశాన్యాన్ని చూపిస్తోంది అనుకొంటే గంటల ముల్లు ఏ దిక్కును సూచిస్తుంది?
ఎ) పడమర బి) దక్షిణం సి) ఉత్తరం డి) తూర్పు

17. విజయ్ కాలేజీకి వెళ్లాలనుకొన్నాడు. అతను తన ఇంటి నుంచి బయలుదేరాడు. అతని ఇల్లు తూర్పున ఉంది. ఆ రోడ్డు కూడలికి వచ్చిన తరవాత ఎడమవైపున ఆడిటోరియం ఉంది. అతని ఇంటికి ఎదురు రోడ్డులో బ్యాంక్ ఉంది. అయితే కాలేజ్ ఏ దిశలో ఉంది?
ఎ) దక్షిణం బి) ఉత్తరం సి) పడమర డి) తూర్పు

18. ప్రశ్నార్థకం గుర్తుగల స్థానంలో వచ్చే సంఖ్యని తెలపండి?




ఎ) 260 బి) 220 సి) 280 డి) 240

19. ప్రశ్నార్థకం గుర్తుగల స్థానంలో వచ్చే సంఖ్యని తెలపండి?

L_8	N_4	M_{80}
M_4	L_3	N_{25}
N_6	M_8	?

ఎ) L_{100} బి) N_{80} సి) M_{60} డి) L_{120}

20. ప్రశ్నార్థకం గుర్తుగల స్థానంలో వచ్చే సంఖ్య?



ఎ) 172 బి) 186 సి) 144 డి) 196

21. ఫొటోలో ఉన్న ఒక వ్యక్తిని చూపిస్తూ అజయ్ ఇలా చెబుతున్నాడు. 'అతను నా తల్లి తండ్రికి ఏకైక కుమారుని ఏకైక సోదరి భర్తకు కుమార్తె కొడుకు'. అయితే ఫొటోలోని వ్యక్తి అజయ్‌కు ఏమవుతాడు?
ఎ) మేనమామ బి) మేల్లుడు
సి) అల్లుడు డి) సోదరుడు

22. ఫొటోలో ఉన్న వ్యక్తిని చూపిస్తూ అవినాష్ ఇలా చెబుతున్నారు. 'అతను నా తండ్రి తల్లికి ఏకైక కుమారుడి సోదరి భర్త భార్యకు ఏకైక సోదరుడు.' అయితే ఫొటో లోని వ్యక్తికి అవినాష్ ఏమవుతాడు?
ఎ) అల్లుడు బి) సోదరుడు సి) తండ్రి డి) కుమారుడు

23. AA, BE, FI, OO, -------------
ఎ) EU బి) EV సి)FU డి) FV

24. AZ, CX, FT, JN, --------------
ఎ) DE బి) OF సి) FO డి)EP

25. TE, SF, QI, NN, ----------
ఎ) JU బి) KU సి) IV డి) TV

26. a - c - cbc - b - ca - cbab - a -
ఎ) babacac బి) baaabcc
సి) ababacc డి) ఏదీకాదు

27. aab - dab - cdabc - d - bc - d
ఎ) abcdc బి) bcdcd సి) cbcad డి) ఏదీకాదు

28. వికాస్ దక్షిణానికి 7మీ. నడిచిన తరవాత ఎడమ వైపునకు తిరిగి 9 మీటర్లు నడిచాడు. చివరకు మరల కుడివైపునకు తిరిగి 5మీ. నడిచాడు. అయితే ఇప్పుడు వికాస్ బయలుదేరిన స్థానం నుంచి ఎంత దూరంలో ఏ దిశలో ఉన్నాడు?
ఎ) 15 మీ నైరుతి బి) 15 మీ వాయవ్యం
సి) 15 మీ ఆగ్నేయం డి) 15 మీ ఈశాన్యం

29. ఒక వరసలో అనిల్ కుడివైపునుంచి 24వ స్థానంలోను, ఎడమవైపునుంచి 17వ స్థానంలోను ఉన్నాడు. అదే వరసలో సునీల్ ఎడమవైపు నుంచి 26వ స్థానంలో ఉంటే కుడి వైపు నుంచి సునీల్ స్థానమెంత?
ఎ) 15 బి) 18 సి) 16 డి) 19

30. ఒక వరసలో నిశాంత్ కుడివైపునుంచి 18వ స్థానంలోను, ఎడమవైపు నుంచి 13వ స్థానం లోను ఉన్నాడు. అదే వరసలో నిరంజన్ తన కుడివైపునకు 5 స్థానాలు జరిగాడు ప్రస్తుతం అతను ఎడమవైపు నుంచి 22వ స్థానంలో ఉన్నట్లయితే కుడివైపు నుంచి నిరంజన్ మొదటి స్థానం ఎంత?
ఎ) 16 బి) 14 సి) 18 డి) ఏదీకాదు

31. ఇంటర్వ్యూని నిర్వహించడానికి మేనేజింగ్ డైరెక్టర్ గం. 10 కంటే 15 నిలు ముందుగా వచ్చారు. ఈ మేనేజింగ్ డైరెక్టర్, ఛైర్మన్ కంటే 30 నిలు ముందుగా వచ్చారు. ఛైర్మన్ ఇంటర్వ్యూ సమయం కంటే 45నిలు ముందు వచ్చారు. అయితే ఆయన ఏ సమయంలో ఇంటర్వ్యూ నిర్వహించదలచారు?
ఎ) గం. 11.00ని. బి) గం. 11.02ని.
